# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



వివరాలు మెయిన్‌లో...

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి



## నేడు 15.22 కోట్ల అభివృద్ధి పనులు

# ప్రారంభించనున్న మంత్రులు




ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ శాఖ, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ పర్యటించనున్నారు. దాదాపు రూ.15 కోట్ల 22 లక్షల నిధులతో పూర్తి చేసిన పనులను ప్రారంభిస్తారు. రూ. కోటి 65 లక్షలతో వేములవాడ బస్టాండ్ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక చొరవ, నిరంతర పర్యవేక్షణతో ఈ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తయ్యాయి. ప్రణాళికాబద్ధంగా చేపట్టిన ఈ పనులు జిల్లాలో పర్యాటక, మౌలిక వసతుల అభివృద్ధికి మరింత దోహదపడనున్నాయి.

### ఆహ్లాదకరంగా గుడి చెరువు బండి పార్క్

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో బండ్ పార్క్ ఆహ్లాదకరంగా రూపుదిద్దుకుంది. మహాశివుడి విగ్రహం మరింత ఏర్పాటుతో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుంది. పర్యాటకశాఖ ఆధ్వర్యంలో వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ నిధులు రూ. 12 కోట్లతో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో బండ్ పార్క్ నిర్మాణ పనులు చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పర్యాటక శాఖ అధికారులు బండ్ పార్క్ లో 40 ఫీట్ల ఎత్తైన మహాశివుడి విగ్రహం, సప్తమాత్రికల విగ్రహాలు ఏర్పాటు చేశారు. గుడి చెరువులో బోటింగ్ సదుపాయం ఏర్పాటు చేసేందుకు పర్యాటక శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.బండ్ పార్క్ లో నటరాజ్ స్టాచ్యూ ఫౌంటెన్,సూర్య నమస్కార్, వాకింగ్ ట్రాక్, కోబుల్ స్టోన్ ఫ్లోరింగ్,ల్యాండ్ స్కేప్, అంఫ్లీ థియేటర్, తదితర పనులు పూర్తి చేసి ఆకర్షణీయ మొక్కలు నాటారు.

### సిరిసిల్ల ఖ్యాతిని మరింత చాటేలా.. ప్రత్యేక ఆకర్షణగా రగుడు బై పాస్ జంక్షన్





సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఖ్యాతిని మరింత చాటేలా వస్త్ర ఉత్పత్తి దశలు అందరికీ అర్థం అయ్యేలా ఏర్పాటు చేసిన నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేములవాడకు వచ్చే భక్తులు, పర్యాటకులు, వివిధ ప్రాంతాల ప్రజలు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో వస్త్ర ఉత్పత్తిలో వివిధ దశలను తెలుసుకునేలా ఏర్పాటు చేసిన నమూనాలపై హర్షం వ్యక్తం అవుతుంది. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పనులను పలుమార్లు పరిశీలించి వేగంగా.. ఆకర్షణీయంగా పూర్తి చేసేలా ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ఇరువైపులా రోడ్డును విస్తరింపజేశారు. అలాగే రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా సైన్ బోర్డ్స్ ఇతర భద్రతా చర్యలు తీసుకోవాలని రోడ్డు సేఫ్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆదేశాలు జారీ చేశారు. రూ. 3 కోట్ల 10 లక్షలతో రగు డు బై పాస్ జంక్షన్ సుందరీకరణ లో భాగంగా బీటీ రోడ్డు విస్తరణ, హై మాస్ట్ లైట్లు, గ్రీనరీ, రోడ్డు భద్రత చర్యలు, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ లో వివిధ దశల నమూనాలు సిద్ధం చేశారు. ప్రత్యేక ఆకర్షణగా జోట (నాడే) నిలుస్తుంది.

### మోడల్ బస్ షెల్టర్స్

ప్రయాణికులు, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం, ఎస్పీ కార్యాలయం ఉద్యోగులు, పరిసర ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం రగుడు బై పాస్ జంక్షన్ వద్ద కరీంనగర్ రోడ్డులో.. కామారెడ్డి రోడ్డులో రూ. 12.50 లక్షలతో మోడల్ బస్ షెల్టర్స్ సిద్ధం చేశారు. అందరికీ ఎంతో ఉపయోగకరంగా అందుబాటులో ఉంది.

### నేడు వేములవాడ బస్టాండ్ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం

కోటి 65 లక్షల రూపాయలతో వేములవాడ బస్టాండ్ పునర్నిర్మాణ పనులకు జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పనులకు గురువారం శంకుస్థాపన చేయనున్నారు. పునర్నిర్మాణ పనుల్లో భాగంగా ఆఫీసు రూమ్స్, బస్ స్టాండ్ ఆవరణ సుందరీకరణ, పచ్చదనం పెంపు తదితర పనులు చేయనున్నారు.



## వర్షంలోనూ గిరి ప్రదక్షిణ

గురు వ్యాస పౌర్ణమి సందర్భంగా జగిత్యాల జిల్లా మల్యాల మండ లం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థాన ంలో బుధవారం నిర్వహించిన 43 వ గిరిప్రదక్షిణలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, రవాణా,బిసిసంక్షే మ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ వి ప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్‌పి అశోక్ కుమార్ పాల్గొన్నారు.

## పొంగి పొర్లుతున్న కడెం, దోత్తి, పల్కేరు వాగులు

ప్రజాపక్షం/పెంబి: పెంబి మండలంలోని కడెం, దొ త్తి, పలుకేరు వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. శెట్పల్లి వద్ద కడెం వాగు,దో త్తి, వాగు కలిసే ప్రాంతంలో వరద ఉధృతి తీవ్రమైంది దీంతో యాపలు కూడా,రాంనగర్, సత్తుగూడ,వాసుపల్లి, చాకిరేవు, దొందరి గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి వరద నీరు తగ్గితే తప్ప ఆయా గ్రామాల ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది.అలాగే రాత్రి కురిసిన భారీ వర్షానికి మందపల్లి శివారులోని పలుకేరువాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది మండలంలో కురుస్తున్న అధిక వర్షాలతో వాగులు ఓ్రెలు నిండి పారుతుండటంతో రైతులు పశువుల కాపరులు ఇతర పనులకు వెళ్లేవాళ్లు అప్రమత్తంగా ఉండాలని నీటిపారుదల శాఖ మరియు రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.పెంబి పెద్ద చెరువు లోకి భారీగా వరద నీరు చేరుతుండడంతో ఈసారి పంటలు సమృద్ధిగా పండుతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మూడు సంవత్సరాల క్రితం పసుపుల గ్రామం వద్ద కడెం వాగుపై నిర్మించిన వంతెన భారీ వర్షాల కారణంగా కూలిపోవడంతో వంతెనకు అవతల వైపు ఉన్న పసుపుల హరిచంద్ర తండా తులసిపేట్, కొరకంటి కోరకంటి తండా గ్రామాల ప్రజలకు ఇటు రావడానికి ఎలాంటి సౌకర్యాలు లేక అత్యవసర పరిస్థితుల్లో అనారోగ్య కపాలయతే దేవునిపై భారం వేసి అక్కడి ప్రజలు దిక్కుతోచని స్థితిలో కాలం వెలదీస్తున్నారు.ఇప్పటికైనా శిథిల కూలిపోయిన వంతెనను పునర్నిర్మించి ఆదుకోవాలని అక్కడి గ్రామస్తులు కోరుతున్నారు.



## ఇకెవైసి పేరిట ప్రజలను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం

**ప్రజాపక్షం/చొప్పదండి:**తెలంగాణలో రేషన్ కార్డుల ఈ కేవైసీ పూర్తి చేయడానికి ఈనెల 31 వరకు గడువు ముగుస్తుండడంతో ప్రజలు మీ సేవ ఆధార్ సెంటర్ చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారని బిజేపి ఎస్‌సి మోర్చా జిల్లా అధ్యక్షుడు బత్తుల లక్ష్మీ నారాయణ పేర్కోన్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ సెంటర్లలో సర్వర్ సరిగ్గా పని చేయక ఈ కేవైసీ పూర్తి కాకపోవడంతో రేషన్ కార్డులో పేర్లుతొలగిస్తారనేభయాందోళనలకుప్రజ లు గురువుతున్నారని ఆవేదన వ్యక్తం చే శా రు.

## 38 కేసుల్లో లభించిన 63.621 కిలోల గంజాయి దగ్ధం

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 38 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 63 కిలోల 621 గ్రాముల గంజాయి,ఒక గంజాయి మొక్కను బుధవారం ధ్వంసం చేసినట్లు కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. మానకొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈదులగట్టెపల్లి గ్రామంలో ఉన్న వెంకటరమణ ఇన్సినేటర్‌లో పోలీస్ కమీషనర్ సమక్షంలో డ్రగ్ డిస్పోసల్ కమిటీ ఆధ్వర్యంలో ఈ గంజాయిని దహనం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.ఎసిపిలు శ్రీనివాస్, వెంకట స్వామి ఇ న్స్‌పెక్టర్లు రఫీక్ , శ్రీలత ,ఆర్ఐలు రజినీ కాంత్ , శ్రీధర్ రెడ్డి, ఇన్సినరేటర్ ప్లాంట్‌కు చెందిన తిరుపతి , ప్రభాకర్ రెడ్డిలతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఉపరితల ద్రోని ప్రభావంతో పెద్దపెల్లి జిల్లా వ్యాప్తంగా 14 మండలాల్లో విస్తారంగా వర్షాలు కురుసాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. బుధవారం రోజున జిల్లాలో ధర్మారం మండలంలో 95.8 మిల్లీమీటర్లు, పాలకుర్తి 114.4 మిల్లీమీటర్లు, అంతర్గాం 101.2 మిల్లీమీటర్లు, రామగుండం 135.4 మిల్లీమీటర్లు, పెద్దపల్లి 111.6 మిల్లీమీటర్లు, జూలపల్లి 51.4 మిల్లీమీటర్లు, ఎలిగేడు 51.4 మిల్లీమీటర్లు, సుల్తానాబాద్ 42.6 మిల్లీమీటర్లు, ఓదెల 42.8 మిల్లీమీటర్లు, కాల్వ శ్రీరాంపూర్ 47.6 మిల్లీమీటర్ల వర్షం కురిసిందని జిల్లా వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

# ఉదయ్ నగర్ సింగరేణి క్వార్టర్లలో తీవ్ర డ్రైనేజీ సమస్య

### శాశ్వత పరిష్కారం కోరుతున్న కాలనీవాసులు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని ఉదయ్ నగర్ సింగరేణి క్వార్టర్ల లో (351 నుంచి 381) ని వసిస్తున్న కార్మికులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర డ్రైనేజీ సమస్యతో నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. గత రాత్రి కురిసిన భారీ వర్షంతో సమస్య మరింత తీవ్రరూపం దాల్చింది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షపు నీరు క్వార్టర్లలోకి భారీగా చేరింది. హాలు, బెడ్‌రూమ్, వంటగది సహా ఇంటి మొత్తం నీటితో నిండిపోవడంతో కుటుంబాలు రాత్రంతా నిద్ర లేకుండా తీవ్ర ఆందోళనకు గురయ్యాయి. ఇది కేవలం వర్షాకాలంలో వచ్చే సమస్య మాత్రమే కాదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండాకాలం, చలికాలం, వర్షాకాలం అనే తేడా లేకుండా ఏడాది పొడవునా డ్రైనేజీ సరిగా పనిచేయకపోవడంతో మురుగు నీరు నిలిచిపోవడం, దుర్వాసన,దోమల బెడద వంటి సమస్యలు ఎదుర్కొంటున్నామని వారు చెబుతున్నారు. ప్రతిరోజూ గనుల్లో కష్టపడి విధులు నిర్వహించి ఇంటికి చేరుకునే కార్మికులకు కనీస విశ్రాంతి కూడా లభించని పరిస్థితి ఏర్పడిం ది. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ప డుతున్నారు.ఈ సమస్యపై కాలనీవాసులు పలుమార్లు సి విల్ అధికారులకు, యాజమాన్యానికి వినతిపత్రాలు సమర్పించారు.అందరూ కలిసి సివిల్ కార్యాలయానికి వెళ్లి వివరించినప్పటికీ, ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం కోసం ఎ లాంటి చర్యలు చేపట్టలేదు.కావున తాత్కాలిక మరమ్మతుల తో కాకుండా , మొత్తం డ్రైనేజీ వ్యవస్థను పునర్నిర్మించి అవసరమైన చోట పెద్దపైప్ లైన్లు ఏర్పాటు చేసి, ప్రతి క్వార్టర్‌లో నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కా ర్మికులు, వారి కుటుంబ సభ్యులు మరియు కాలనీవాసులు ఏకగ్రీవంగా సింగరేణి యాజమాన్యంకువిజ్ఞప్తి చేస్తున్నారు.

# ఓడేడు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సస్పెన్షన్

**ప్రజాపక్షం/ముత్తారం :** పార్టీ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నందున పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఒగులవేన అఖిల్ గౌడ్ ను పార్టీ నుండి సస్పెండ్ చేసినట్లు మంథని నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చీమల సందీప్,ముత్తారం మండల అధ్యక్షుడు బక్కతట్ల వినీత్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.ఐటీశా ఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,యువ నాయకులు,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు. బుధవారం ను ండి సదరు వ్యక్తికి కాంగ్రెస్ పార్టీతో కానీ,పార్టీ అధికారిక కార్యక్రమాలతో కానీ ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

**నాకు పదవి ఇష్టం లేదని ముందే చెప్పా అఖిల్ గౌడ్ :** ఈ సస్పెన్షన్ అంశంపై 'ప్రజాపక్షం' ప్రతినిధి అఖిల్ గౌడ్ ను సంప్రదించగా ఆయన స్పందించారు. తనకు యువజనకాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్ష పదవి చేపట్టడం ఇష్ట లేదని గత మూడు నెలల క్రితమే పార్టీ నాయకత్వానికి స్పష్టం చేశానని ఆయన తెలిపారు.అయినప్పటికీ వారు వినకుండాతనకుబలవంతంగాపదవికట్టబెట్టారనిఅ న్నారు.

# గ్రామాభివృద్ధి పనులు వేగవంతం

### మండల ప్రత్యేక అధికారి జయరాజ్



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం గ్రామాభివృద్ధి పనులపై మండల ప్రత్యేక అధికారి జయరాజ్ అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది.అనంతరం ఆయా శాఖల అధికారులు అజెండాలోని చేపట్టిన, చేపట్టే బోయె పనులకు సంబంధించి అంశాలను చదివి వినిపించారు. అనంతరం మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులను ప్రోత్సహించాలని, గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. మొక్కజొన్న పంటకు అదనంగా యూరియా బస్తాలు కేటాయించాలని,ముందస్తుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సర్పంచులు ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకువెళ్లారు. వర్షకొండ–అమ్మక్కపేట గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు మీటర్లను బిగించి విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు.వాటికి విద్యుత్తు కనెక్షన్లను ఇవ్వలేదని, విద్యుత్ సరఫరా వెంటనే ప్రారంభించాలని రెండు గ్రామాల సర్పంచులు విజ్ఞప్తి చేశారు.సమావేశానికి ముందు నూతన ప్రత్యేక అధికారి జయరాజు,డీఎల్‌పీఓ రాజేంద్రప్రసాద్ ల ను సర్పంచులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్,ఎంపీడీవో గణేష్ ,డీఎల్‌పీఓ రాజేంద్రప్రసాద్, ఎంఈఓ బండారి మధు, ఎంపీ ఓ రామకృష్ణ రాజు,వివిధ శాఖల అధికారులు,సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఇంటిముందు బురదను తొలగించాలని రోడ్డుపై నిరసన

**ప్రజాపక్షం / గన్నేరువరం:** గన్నేరువరం నుంచి పొరువెల్ల వెళ్లేదారిలో తన ఇంటి ముందు వరద నీరు ఆగి బురదమయం అవుతోందని దీంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది రోగాలబారిన పడుతున్నామని సమస్యను వెంటనే పరిష్కరించేదాకా ఈ మార్గంలో ఎవరినీ వెళ్లనీయనని రోడ్డుకు అడ్డంగా కట్టెలు పెట్టి రోడ్డుపై కూర్చొని నిరసన తెలిపాడు వెదిర శ్రీకాంత్. గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన వెదిర శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి వర్షాకాలం చిన్నపాటి వర్షానికి తన ఇంటి ముందు వర్షపు నీరు చేరి వెళ్లే మార్గం లేక కుంటను తలపించే విధంగా మురుగు నీరు ఉంటుందని దీంతో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామ సెక్రటరీ వెంకట్ రెడ్డి, సర్పంచ్ వచ్చి సమస్యను పరిష్కరించే వరకు ఈ మార్గంలో ఎవరినీ వెళ్లనీవ్వనని అన్నాడు. దీంతో ప్రయాణీకులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకొని శ్రీకాంత్‌ను సర్దిచెప్పే క్రమంలో వారి ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు నచ్చజెప్పడంతో శ్రీకాంత్ సమస్య పరిష్కరించాలని కోరుతూ వెళ్లిపోయాడు.

## ట్రాక్టర్ బోల్తా పడి రైతు దుర్మణం

**ప్రజాపక్షం / జమ్మికుంట :** కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో బుధవారం విషాద ఘటన చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన రైతు అరుకాల కుమారస్వామి తన స్వంత ట్రాక్టర్‌తో వ్యవసాయ పనుల నిమిత్తం పొలాన్ని దున్నుతున్న సమయంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్ కింద చిక్కుకున్న కుమారస్వామి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానిక రైతులు, గ్రామస్థులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టినా అప్పటికే కుమారస్వామి మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఘటనపై వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన సమయంలో జరిగిన ప్రమాదం స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. రైతు కుమారస్వామి మృతి పట్ల ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, గ్రామస్థులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నారు.

## విస్తారంగా వర్షాలు.. ఊపిరి పీల్చుకున్న రైతులు...

**ప్రజాపక్షం / గన్నేరువరం :** గన్నేరువరం మండలంలో విస్తారంగా వర్షాలు పడుతుండడంతో రైతన్నలు ఊపిరి పీల్చుకున్నారు. గత నెల రోజులుగా వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. గత రెండు రోజుల నుంచి వర్షం ఎడతెరపి లేకుండా పడుతుండడంతో రైతుల కళ్లలో ఆనందం వెల్లివిరుస్తోంది. నీరు తడి లేక ఎండిపోతున్న పంటలకు ఈ వర్షాలు ప్రాణం పోశాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ఈ వానలకు చెరువులు, వాగులు, కుంటలకు నీరు చేరుతున్నాయి. జలకళతో రైతులు ఆనందంతో వరి నాట్లు మొదలు పెట్టారు.

## భారీ వర్షాల నేపథ్యంలో భవన నిర్మాణ కార్మికులు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజపక్షం/రామగిరి :** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో భవన నిర్మాణ కార్మికులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు చిలువేరు స్వామి సూచించారు.భారీ వర్షాల కారణంగా నిర్మాణ స్థలాల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, కార్మికులు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన అన్నారు.ముఖ్యంగా వర్షాలకు తడిసి బలహీనపడిన పాత గోడలు, శిథిలావస్థలో ఉన్న నిర్మాణాల వద్ద పనులు చేయవద్దని సూచించారు.అలాంటి గోడలు ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉండడంతో కార్మికులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.అదేవిధంగా ఎతైన భవనాలపై పనిచేసే సమయంలో తప్పనిసరిగా రక్షణ పరికరాలు ధరించాలని, విద్యుత్ తీగలు, నీటితో నిండిన గుంతలు, జారుడు ప్రదేశాల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితులు మినహా భారీ వర్షాల సమయంలో పనులకు దూరంగా ఉండాలని,కార్మికుల ప్రాణ భద్రతే అత్యంత ముఖ్యమని అన్నారు. గృహ నిర్మాణ యజమానులు కూడా కార్మికుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపట్టాలని చిలువేరు స్వామి కోరారు.

# దొంగతనం చేసిన స్నేహితుడు

### రూ.17.60 లక్షల నగదు, కారు స్వాధీనం



**ప్రజాపక్షం / కొత్తపల్లి :** మనోడే అని నమ్మి ఇంటికి రానిస్తే చిన్ననాటి స్నేహితుని దొంగబుద్ధి బాగోతం బయటపడింది. ఒక చోరీ కేసు దర్యాప్తు చేసేందుకు వెళ్లిన పోలీసులకు అనుమానస్పదంగా కనిపించిన వ్యక్తి గురించి ఆరా తీస్తే అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అవసరానికి పనికొస్తాయని భూమి అమ్ముకొని నగదు ఇంట్లో పెట్టుకుంటే ఇంటికి వచ్చిన స్నేహితుడే కాజేసి పరారైన సంఘటన బయటపడింది. నిందితుడు పోలీసులకు చిక్కడంతో అరెస్ట్ చేసిన పోలీసులు బుధవారం మీడియా ముందు హాజరు పరిచి సీపీ గౌస్ ఆలం వివరాలు వెల్లడించారు. కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లికి చెందిన గుడిమల్ల శ్రీనివాస్ డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల తన వ్యవసాయ భూమి అమ్మగా వచ్చిన రూ.26 లక్షలను ఇంట్లో భద్రంగా దాచుకున్నాడు. మంథని మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌కు అదే గ్రామానికి చెందిన శంకర్ లాల్ చిన్ననాటి స్నేహితుడు కావడంతో కరీంనగర్‌కు వచ్చినప్పుడల్లా ఇంటికి వస్తుండేవాడు. చిన్ననాటి నుంచి ఉన్న పరిచయంతో శ్రీనివాస్ ఇంట్లో లేకపోయినా శంకర్ లాల్ కోసం తాళం చెవి భద్రపరిచేవాడు. ప్రజా ప్రతినిధిగా పని చేసి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న శంకర్ లాల్ అవసరాల కోసం అడ్డదారుల్లో పయనించాడు. భూమి అమ్మితే వచ్చిన డబ్బులు శ్రీనివాస్ దగ్గర ఉన్నాయని గ్రహించి ఓ మహిళతో కలిసి వాటిని కాజేసేందుకు పథకం రచించాడు. రేష్మ అనే మహిళతో కలిసి జూన్ నెలలో శ్రీనివాస్ ఇంటికి వచ్చి శ్రీనివాస్ అందుబాటులో లేకపోవడంతో అదునుగా భావించి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి నగదును దోచుకెళ్లారు. దొంగిలించిన డబ్బుతో శంకర్ లాల్ స్విఫ్ట్ కారు కూడా కొనుగోలు చేశాడు. శ్రీనివాస్ ఇంటిలోనే కింది పోర్షన్‌లో గతంలో జరిగిన లాప్టాప్ చోరి కేసులో దర్యాప్తు చేసేందుకు వెళ్లిన పోలీసులకు శంకర్ లాల్ అనుమానస్పందంగా వచ్చిపోయే సీసీ ఫుటేజ్ లభ్యమయింది. విచారణలో శ్రీనివాస్ ఇంట్లో చోరీ కుడా బయటపడడంతో శంకర్ లాల్ నిందితుడిగా గుర్తించి అతని కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో నిందితుడు బొమ్మకల్ బస్ స్టాఫ్ వద్ద వాహన తనిఖీల్లో పట్టుబడ్డాడు. విచారణ అనంతరం అతని వద్ద నుంచి రూ.17 లక్షల 60 వేల నగదు, స్విఫ్ట్ కారు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న రూరల్ ఏసీపీ విజయ్ కుమార్, ఇన్స్‌పెక్టర్ నిరంజన్ రెడ్డి, ఎస్సై లక్ష్మారెడ్డి, పోలీస్ కానిస్టేబుల్ల బృందాన్ని సీపీ ప్రత్యేకంగా అభినందించారు.

## మానేరు వాగులో కొట్టుకుపోయిన మట్టి రోడ్డు

**ప్రజాపక్షం/ముత్తారం :** గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు మానేరు వాగులో వరద నీరు ప్రవహిస్తోంది.ఈ వరద నీటి తాకిడికి నేషనల్ హైవే రోడ్డు పనుల కోసం వాగులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది.రోడ్డు తెగిపోవడంతో జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.రెండు జిల్లాలను అనుసంధానించే ఈ ప్రధాన మార్గంలో తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ప్రయాణికులు సుదూర ప్రాంతాల గుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాల్సి వస్తోంది.

## మంత్రుల పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రత ఏర్పాట్లు: ఎస్పి

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** వేములవాడ, సిరిసిల్ల లో మంత్రుల పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈసందర్భంగా బుధవారం సాయంత్రం సిరిసిల్ల లోని రగుడు బై పాస్ జంక్షన్,బస్ షెల్టర్ ప్రాంతాలను, వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో ట్యాంక్ బండ్ పార్క్ ప్రాంతాలను ఎస్పీ స్వయంగా అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఎస్పీ వెంట డిఎస్పీ లు నాగేంద్రచారి, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ వెంకటేశ్వర్లు, సి.ఐ లు శ్రీనివాస్, వీరప్రసాద్, ఎస్.ఐ లు సిబ్బంది ఉన్నారు.

## ఘనంగా డాక్టర్ సినారే జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, పద్మభూషణ్ డాక్టర్ సి. నారాయణ రెడ్డి జయంతి వేడుకలను సిరిసిల్ల తెలంగాణ భవన్ లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆయన ఒక గొప్ప కవి అని కొనియాడారు. డాక్టర్ సి నారాయణ రెడ్డి మన జిల్లాకు చెందిన వారు కావడం మన జిల్లాకి గర్వకారణం అన్నారు. మాజీ నాస్కబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, మున్సిపల్ చైర్మన్ జిందం కళ చక్రపాణి, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి,దార్ల సందీప్, మున్సిపల్ కౌన్సిలర్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గురు పౌర్ణమి వేడుకలు

**ప్రజాపక్షం/మల్లాపూర్:** మల్లాపూర్ మండల కేంద్రంలో పాటు ఆయా గ్రామాల్లో గురు పౌర్ణమి సందర్భంగా వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు.ఈ సందర్భంగా కుస్తాపూర్ గ్రామంలోని ప్రైమరీ పా ఠశాలల్లో ఉపాధ్యాయులను, గురు పౌర్ణమి సందర్భంగా గ్రామ సర్పంచ్,జెల్ల రాజేశ్వ ర్ ,ఉపసర్పంచ్ సరికేల మహిపాల్ ఆధ్వర్య ంలో ఘనంగా శాలువాలతో సన్మానించారు. అదేవిధంగా ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సర్ కార్యక్రమంలో సర్వేను 100% ఇచ్చిన గడువుకు ముందే పూర్తిచేసిన అంగన్వాడి టీచర్లు (బిఎల్ఓ) ల ను శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజేశ్వర్, ఉప సర్పంచ్ మహిపాల్ ఉపాధ్యాయులు అంగన్వాడి టీచర్లు ఉన్నారు.

## టీ–హబ్, టీ–వర్క్స్ సందర్శనతో విద్యార్థుల్లో స్టార్టప్‌లపై ఆసక్తి



**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో మెట్‌పల్లి–కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులు బుధవారం హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక టీ–హబ్, టీ–వర్క్స్ సంస్థలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆధునిక సాంకేతిక రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులు, స్టార్టప్‌ల అభివృద్ధి, ఆవిష్కరణలు, యువతకు అందుబాటులో ఉన్న నైపుణ్యాభివృద్ధి అవకాశాలపై విద్యార్థులు ప్రత్యక్షంగా అవగాహన పొందారు.టీ–హబ్‌లో స్టార్టప్‌లకు అందిస్తున్న మార్గదర్శకత్వం, మెంటరింగ్, సాంకేతిక సహకారం, పెట్టుబడుల అవకాశాల గురించి తెలుసుకున్న విద్యార్థులు, టీ–వర్క్స్‌లో ఆధునిక యంత్రాలు, ప్రోటోటైపింగ్ సదుపాయాలు, ఉత్పత్తుల రూపకల్పన ప్రక్రియలను పరిశీలించారు. సాంకేతిక ఆవిష్కరణలు ఎలా రూపుదిద్దుకుంటాయనే అంశంపై నిపుణుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ, విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే భవిష్యత్తులో మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని అన్నారు. డిగ్రీ పూర్తయ్యాక ఉద్యోగాల కోసం మాత్రమే ఎదురుచూడకుండా, తమ ఆలోచనలు, సృజనాత్మకతతో కొత్త అవకాశాలను సృష్టించే స్థాయికి యువత ఎదగాలని సూచించారు. టీ–హబ్, టీ–వర్క్స్ వంటి సంస్థలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ పర్యటన తమలో కొత్త ఆలోచనలు, ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని విద్యార్థులు తెలిపారు. సాంకేతిక రంగంలో అందుబాటులో ఉన్న అవకాశాలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం వల్ల తమ భవిష్యత్ లక్ష్యాలపై మరింత స్పష్టత ఏర్పడిందని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ప్రపంచ స్థాయి సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్ అవకాశాలను పరిచయం చేయాలనే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి: చైర్మన్ పుల్కం రాజు

**ప్రజా పక్షం/ వేములవాడ :** గత రాత్రి నుంచి ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వేములవాడ పట్టణంలోని 15వ వార్డు శాత్రాజుపల్లి ప్రధాన రహదారి లో గల కల్వర్ట్ ప్రాంతాన్ని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, పట్టణ కౌన్సిలర్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షపు నీరు నిలిచిపోయిన ప్రాంతాలను పరిశీలించి, కాలువల్లో నీటి ప్రవాహానికి ఆటంకంగా మారిన పిచ్చి మొక్కలు, మురుగు మరియు చెత్తాచెదారాన్ని జేసీబీ సహాయంతో తక్షణమే తొలగించారు. వరద నీరు సాఫీగా సాగిపోయేలా చర్యలు చేపట్టి, స్థానికులకు ఎలాంటి తీవ్ర ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. వర్షాల దృష్ట్యా పట్టణ ప్రజలందరూ తగిన జాగ్రత్తలు వహిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా శిథిలావస్థకు చేరుకున్న పాత ఇళ్లలో నివాసముంటున్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు మారాలని కోరారు. వర్షాల వల్ల ఎలాంటి అత్యవసర పరిస్థితి లేదా ప్రమాదం ఏర్పడినా వెంటనే మున్సిపల్ సిబ్బందికి గానీ, పోలీస్ శాఖ అధికారులకు గానీ సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. వర్షాకాలం ముగిసే వరకు ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయక చర్యలు అందించడానికి మున్సిపల్ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, పట్టణ కౌన్సిలర్లు అన్నారపు శ్రీనివాస్, కొక్కుల బాలకృష్ణ, కొండ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## చదువునే ఆయుధంగా ఉన్నత స్థితికి ఎదగాలి

### జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ రాజ గౌడ్




**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్:** చదువునే ఆయుధంగా మలుచుకుని విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాలని జిల్లా అదనపు కలెక్టర్ రాజ గౌడ్ అన్నారు.మహిళ శిశు సంక్షేమ శాఖ ,జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో జిల్లా బాలల సంరక్షణ కేంద్రాల తనిఖీ కమిటీ చైర్మన్,అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్ బుధవారం జిల్లా కేంద్రంలోని వాల్మీకి ఆవాసాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ అయిన వాల్మీకి ఆవాసంసేవాభారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆవాసంలో చదువుతున్న విద్యార్థుల విద్య, ఆరోగ్యము, నైపుణ్యాభివృద్ధి సేవలు కేంద్రాల నిర్వహణకు సంబంధించి రికార్డులను స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆవాసంలో చదువుతున్న విద్యార్థుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంరక్షణ కేంద్రాలు పిల్లలకు ఇంటి వాతావరణాన్ని కల్పించే విధంగా ఉండాలని సూచించారు. సంరక్షణ కేంద్రాలే పిల్లలకు కుటుంబాలుగా ఉండటం వల్ల పిల్లలు సమగ్రంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. పిల్లలు సమగ్ర జీవిత అభివృద్ధికి ఇప్పటినుంచి ఒక లక్ష్యం ఏర్పరచుకోవాలని ఆ లక్ష్యం దిశగా అంకితభావంతో ఎటువంటి ఆకర్షణలకు లోను కాకుండా విద్యను అభ్యసించాలన్నారు. పిల్లలు వారి కుటుంబం ప్రస్తుతం ఉన్న స్థితి నుంచి ఉత్తమ స్థితికి చేరుకోవడానికి చదువే ఆయుధమని చదవునే గమ్యంగా మార్చుకోవాలన్నారు విద్యార్థి దశలో ఆరోగ్యము, విద్య ప్రధానమైనవని విద్యార్థి ఆలోచన చర్యలు వాటి చుట్టూనే ఉంటే ఉత్తమ స్థితికి చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ ఏ భాస్కర్, బాలల సంరక్షణ కేంద్రాల తనిఖీ సభ్యులు, జిల్లా బాలల పరిరక్షణ అధికారి పడాల సురేష్,బాలల సంక్షేమ సమితి సభ్యులు విజయలక్ష్మి , పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కోటగిరి భీమేష్ , ఎన్జీవో సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్,వాల్మీకి ఆవాసం కార్యదర్శి మదన్ మోహన్ రావు, సహ కోశాధికారి ఎలుగందుల కైలాసం,ఆవాస ప్రముక్ మల్లేశం,సంరక్షణ కేంద్రాల అధికారి కరుణశ్రీ సంరక్షణ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఇ- కెవైసితో బ్యాంకింగ్ సేవలను సులభంగా పొందవచ్చు

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** ప్రతి ఖాతాదారుడు ఆధార్ కార్డ్ ,బ్యాంక్ పాస్ బుక్, మొబైల్ నెంబర్ తో బ్యాంకులను సందర్శించి ఈ కేవైసీ తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని తద్వారా ఖాతాదారులు బ్యాంకింగ్ సేవలను సులభంగా పొందవచ్చని మెట్పల్లి కేడీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ రేవంత్ కుమార్ అన్నారు.ఈ మేరకు బుధవారం సిరిపూర్ గ్రామంలో ప్రభుత్వం బ్యాంక్ ఖాతాల ఈ కేవైసీ ఆధార్ అనుసంధానం చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో బ్యాంక్ ఖాతాదారులతో కలిసి ఈ కేవైసీ పై ప్రత్యేక బ్యాంకింగ్ సేవల శిబిరాన్ని మెట్పల్లి కేడీసీసీబీ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా మేనేజర్ రేవంత్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు రైతుల రుణాలు సబ్సిడీలు పెన్షన్లు నగదు బదిలీలలో ఎలాంటి అంతరాయం లేకుండా ఉండాలంటే ప్రతి ఖాతాదారుడు ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని,అందులో భాగంగానే సిర్పూర్ గ్రామంలో ప్రత్యేక క్యాంపును ఏర్పాటు చేయగా గ్రామస్తులు పాల్గొని తమ బ్యాంకు ఖాతాలను సవరించుకోవడంతో శిబిరానికి విశేష స్పందన లభించిందని బ్యాంక్ మేనేజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ సిహెచ్ శ్రీనివాస్, నవ్య రజిత, పిఎసిఎస్ సీఈవో మామిడి రాజేశ్వర్ రెడ్డి, గ్రామస్తులు ఖాతాదారులు పాల్గొన్నారు.

## ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లాలో గురువారం మంత్రుల పర్యటన నేపథ్యంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ బుధవారం ఆయా ప్రాంతాల్లో చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. రగుడు జంక్షన్, వేములవాడ గుడి చెరువు బండ్ పార్క్, ఇతర ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు.ఆయన వెంట వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి, వేములవాడ మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్ ఉన్నారు.

## మారుతి సాగర్ జన్మదిన వేడుకలు

**ప్రజా పక్షం/ వేములవాడ టౌన్:** తెలంగాణ ఉద్యమం నుంచి నేటి వరకు జర్నలిస్టుల హక్కుల సాధన, సంక్షేమం, అక్రిడిటేషన్ల మంజూరు, వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ తెలంగాణ జర్నలిస్టు సమాజానికి అండగా నిలుస్తున్న తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ((టీయూడబ్ల్యూజే హెచ్–143) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ జన్మదిన వేడుకలను బుధవారం వేములవాడ ప్రెస్ క్లబ్‌లో జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మారుతి సాగర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన నాయకులు, ఆయన జర్నలిస్టుల సంక్షేమం కోసం చేస్తున్న కృషిని ప్రత్యేకంగా కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉద్యమ సమయంలో జర్నలిస్టుల గొంతుకగా నిలవడంతో పాటు, రాష్ట్ర ఏర్పాటుకు అనంతరం కూడా మీడియా ప్రతినిధుల హక్కుల పరిరక్షణ, అక్రిడిటేషన్ల మంజూరు, సంక్షేమ పథకాల అమలు, వృత్తి గౌరవం పెంపు వంటి అంశాల్లో ఆయన పోషిస్తున్న పాత్ర అభినందనీయమని పేర్కొన్నారు.ఈ సంధర్భంగా జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో, సంఘాన్ని బలోపేతం చేయడంలో, ప్రతి పాత్రికేయుడికి న్యాయం జరిగేలా నిరంతరం ఉద్యమాలు చేపట్టడంలో మారుతి సాగర్ ముందుండి నాయకత్వం వహిస్తున్నారని అన్నారు.జర్నలిస్టుల ఐక్యతే సంఘం బలమని, ఆ ఐక్యతను కాపాడుతూ టీయూడబ్ల్యూజే హెచ్–143 ను రాష్ట్రవ్యాప్తంగా మరింత బలోపేతం చేయడంలో మారుతి సాగర్ కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. వేములవాడ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ, ముఖ్య సలహాదారులు కొత్వాల్ శ్రీనివాస్, జిల్లా క్రమశిక్షణ కమిటీ కన్వీనర్ రసూల్, ఉపాధ్యక్షుడు సిహెచ్ దేవరాజ్, పంపరి నాగరాజు ఫహద్, దెబ్బేటి ప్రవీణ్, రాపెల్లి గంగాధర్, తదితరులు పాల్గొని మారుతి సాగర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో అమలు చేయాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** భూగర్భ జలాలను పెంపొందించి ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకునే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ జలసిరి కార్యక్రమం,ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, గ్రామీణాభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కార్యక్రమాల అమలు తీరును సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ భూగర్భ జలాల పెంపుదలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వీబీ జీ రామ్ జీ పథకాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ గ్రామాల్లో తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారుజిల్లాలో ప్రతి బోర్‌వెల్ వద్ద రీచార్జ్ పిట్ ఏర్పాటు చేసి భూగర్భ జలాల పునరుద్ధరణకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లకు అర్హుల ఎంపికను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని అధికారులకు సూచించారు. మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సెప్టెంబర్ 15లోపు పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణతో పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.మొదటి విడతలో మంజూరు కాకుండా పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్లతో పాటు గుడిసెల్లో నివసిస్తున్న అర్హుల కోసం ప్రతిపాదించిన గృహాల వివరాలను రేపటిలోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఇంటి స్థల స్లాబ్ విస్తీర్ణం 750 చదరపు గజాలకు మించకుండా నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రతి ఇందిరమ్మ ఇంటికి 90 రోజుల ఉపాధి హామీ పనిదినాలు కల్పించేలా చర్యలు తీసుకోవడంతో పాటు,వ్యక్తిగత మరుగుదొడ్ల (ఐహెచ్ఎల్) నిర్మాణానికి సంబంధించిన చెల్లింపులు సకాలంలో అందేలా పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకొని పనిచేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) నరేందర్,డి.ఆర్.డి.ఓ.కాళిందిని ,పీడీ హౌసింగ్ రాజేశ్వర్, ఎంపీడీవో లు,సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# వర్షానికి కూలిన పైకప్పు గోడ

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండలం కేంద్రంలోని పాతబస్టాండ్ ఏరియా వద్ద ఇటివల కురుస్తున్న వర్షానికి కోనేటి మల్లయ్య పెంకుటిల్లు గోడ పైభాగం కూలింది.ప్రభుత్వం పరంగానిరుపేదకుటుంబానికి సహకరించాలన్నారు.సంబంధితరెవిన్యూఅధికారులను భాధితకుటుంబంపరిశీలించాలనికోరా రు.

# విద్యుదాఘాతంతో మేక మృతి

**ప్రజాపక్షం/శంకరపట్నం:** మండల పరిదిలోని కాచాపూర్ గ్రామంలో బుదవారం విషాద ఘటన చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన ఏరూకొండ నారాయణ మేకలను మేపేందుకు తీసుకెళ్లగా ఓ మేక ట్రాన్స్ఫ్రర్మర్ సమీపానికి వెళ్లి విద్యుత్ గ్రౌండ్ హెర్త్ పైపుకు తగిలి విద్యుత్ ఘాతానికి గుర్తై అక్కడికక్కడే మృతి చెందింది.ఉదయం నుంచి కురిసిన వర్షాల కారణంగా పరిసర ప్రాంతంలో విద్యుత్ లీకేజి ఏర్పడినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు.అదే సమయంలో మరో నాలుగు మేకలు కూడ విద్యుత్ ప్రభావానికి గుర్తై అస్వస్థతకు గురయ్యాయి.ఈ ఘటనతో మేకల కాపరి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు.గ్రామస్థులు స్పందిస్తూ ట్రాన్స్ఫ్రర్మర్ల వద్దతగినభద్రతా చర్యలు చేపట్టాలని కోరారు.

# వర్షాకాలంలో విద్యుత్‌పట్ల అప్రమత్తత

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని,ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉంటాయని టీజీఎస్పీడిసిఎల్ సిరిసిల్లా సుపరిండెంట్ ఇంజనీర్ వేణుమాదవ్ తెలిపారు.బుధవారం మీడియా ప్రకటన విడుదల చేసి మాట్లాడారు.గృహవినియోగదారులు,రైతులు,పశువులకాపరు లు, విద్యార్థులు ,విద్యుత్ భద్రత నియమాలను పాటించాలని ప్రమాదాలను నివారించాలని ప్రజలను కోరారు.విద్యుత్ ఉపకరణాలను,గోడకు ఆనుకుని ఉన్న స్థంభాలను తాకరాదని అన్నారు.ట్రాన్స్ఫర్మల వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు.బహిరంగ ప్రదేశాల చెట్లవద్ద నిలబడరాదని ,ఉరుములు,మెరుపులు సంభవించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

# సానిటేషన్ మెటీరియల్, రైన్‌కోట్ల పంపిణీ



**ప్రజాపక్షం/శంకరపట్నం:** మండల పరిదిలోని కాచాపూర్ గ్రామంలో గ్రామపంచాయతీ సిబ్బందికి బుదవారం సర్పంచ్ ఊకంటి మాధవి ఆధ్వర్యంలోసానిటేషన్ మెటీరియల్‌తో పాటు రైన్‌కోట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాధవి మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న సిబ్బంది వర్షాకాలంలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు రైన్ కోట్లు పంపిణీ చేశామన్నారు.రైన్ కోట్లతో పాటు సానిటేషన్ సామాగ్రి పంపిణీ చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపివో ప్రభాకర్,పంచాయతీ కార్యదర్శి సంపత్,ఉపసర్పంచ్ కృష్ణారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల ప్రజలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మండల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని గొల్లపల్లి ఎస్ఐ కృష్ణ సాగర్ రెడ్డి సూచించారు.వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం మరో నాలుగు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కృషి అవకాశం ఉన్నందున ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.పెడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు ,వంకలు ,చెరువులు ,కాలువల్లో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున వాటిని దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు .చేపల వేట కోసం చెరువులు వాగుల వద్దకు వెళ్లవద్దు .పశువులను మేతకు తీసుకువెళ్లే వారు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని ,వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు విద్యుత్ తీగలు ,నీటి ప్రవాహాల అప్రమత్తంగా ఉండాలని సూచించారు .శిథిలావస్థలో ఉన్న లేదా కూలిపోయే ప్రమాదం ఉన్న ఇళ్లలో నివసించ వద్దని తెలిపారు.అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని,ద్విచక్ర వాహనదారులు ,వాహనాదారులు అత్యంత జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించారు .వర్షాల కా రణంగా చెట్లు కూలిన ,విద్యుత్ తీగలు తెగిపడి కనిపించిన,లేదా ఇతర ప్రమాదకర పరిస్థితులు ఎదురైన వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు.ప్రజలు అధికారులు సూచనలను పాటించాలని,అత్యవసర పరిస్థితుల్లో పోలీసు శాఖ ఎల్లప్పుడు ప్రజలకు అండగా ఉంటుందని తెలిపారు.

# రైతులపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల భారం తగదు

## సింగిల్‌విండో చైర్మన్ గుండారపుకృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** రైతులపై కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల భారం తగదనిసింగిల్‌విండో చైర్మెన్ గుండారపుకృష్ణారెడ్డి విమర్శలు చేశారు,బుధవారం మండల స్థాయి సమావేశంలో మాట్లాడారు.రైతులు వినియోగించే కాంప్లెక్స్ ఎరువుల ధరను 1300 నుండి 2100 రూపాయలకు పెంచడం రైతులపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతుందని ఆవేదన చెందారు.ధరల పెంపుపై అదనపు భారం సాగుకై రైతులు మరింత ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందన్నారు.అంతకు ముందు ట్రాన్స్పోర్టేషన్ సహకార సంఘం భరించిందని,ఇటీవల జారీ చేసిన జీవో ద్వార ఆసౌకర్యం తొలగించడం వలన లారీ ఎరువుకు సుమారుగా నాలుగు వందల యాభై బస్తాలు తెప్పించాలంటే 15 వేల రవాణ ఖర్చు చివరికి రైతులపై పడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు.సంబంధిత అధికారులు పట్టించుకుని జిల్లా కలెక్టర్ స్పందించాలని కోరారు.గతంలో అమలులో ఉన్నవిధంగా ఎరువుల రవాణా ఖర్చు ప్రభుత్వం భరించే విధంగా నిర్ణయం తీసుకోవాలన్నారు.సర్వసభ్య సమావేశంలో తీర్మాణం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపాలని ఫ్యాక్స్ చైర్మెన్ గుండారపు కృష్ణారెడ్డి తెలిపారు,కార్యక్రమంలో అధికారులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కెజిబివిలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

**పజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో (కెజిబివి) లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలను బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు గురు శిష్యుల బంధం, గురువుల ప్రాశస్త్యం మరియు వారి విశిష్ట విలువలపై ప్రత్యేక అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అనంతరం సమాజ శ్రేయస్సు కోసం అహరహం శ్రమిస్తున్న ఉపాధ్యాయులకు గురు వందనం సమర్పించి, వారిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో లీడ్ ఇండియా రాష్ట్ర శిక్షణ సమన్వయకర్త తాడూరి శ్రీనివాస్ ఆచార్య మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ ,సన్మార్గం,ఉపాధ్యాయుల పట్ల గౌరవాన్ని పెంపొందించుకోవాలని, గురువులు చూపిన బాటలో నడిచి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.అనంతరం లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బొమ్మెన కుమార్ మాట్లాడుతూ "మన జీవితాల్లోని అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానమనే వెలుగులను నింపే పవిత్రమైన మూర్తులు గురువులు. విద్యార్థులను సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే. లయన్స్ క్లబ్ విసర్వ్ అనే సూత్రంతో పనిచేస్తుంది,ఆ సేవా భావాన్ని మనకు నేర్పింది కూడా మన గురువులే" అని పేర్కొన్నారు.కెజిబివి స్పెషల్ ఆఫీసర్ పద్మ మాట్లాడుతూ.. తమ విద్యాలయంలో గురు పౌర్ణమి పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇటువంటి ఉత్తేజకరమైన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని, విద్యార్థులకు ఇది ఎంతో స్ఫూర్తినిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి సట్ట సురేష్,కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు జలజ,జ్యోతిరాణి,స్రవంతి,అనూష,సు స్మిత, శ్యామల,గంగ జమున, లత,శైలజ, భానుప్రియ, మహేశ్వరీ,వనజ, జయలక్ష్మి ,మంగమ్మ లయన్స్ క్లబ్ ప్రతినిధులు,విద్యార్థినులు పాల్గొన్నారు.

# మూలవాగును పరిశీలించిన ప్రభుత్వ విప్

**ప్రజాపక్షం/ వేములవాడ :** వర్షాలతో రైతుల కళ్లలో ఆనందం నెలకొందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజీపేట, మల్లారం గ్రామాల్లో ఉదయం నుంచి కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఉధృతంగా ప్రవహిస్తున్న నక్కా వాగు ను రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా వాగు పరిసర ప్రాంతాల్లో రైతులతో మాట్లాడి వారి వ్యవసాయ పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు మర్రిపల్లి వేణు మాట్లాడుతూ నిన్నటి వరకు తనకు ఉన్న రెండు ఎకరాల్లో కేవలం ఒక ఎకరం మాత్రమే వరి నాటు వేశానని ఈరోజు నుండి కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో మరో ఎకరం సాగు చేయడానికి సన్నద్ధం చేస్తున్నట్లు తెలిపారు.. వర్షాలు కురవడం పట్ల ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం విప్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించడంతో ప్రభుత్వం అప్రమత్తమైందన్నారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో వ్యవసాయ, సాగునీటి, ఆరోగ్య తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వరి సాగుకు నీటి కొరత ఏర్పడే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని కందులు, మొక్కజొన్న వంటి ఆరుతడి పంటల సాగుపై రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కొండగట్టు అంజన్న ఆలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి గిరి ప్రదక్షిణ నిర్వహించి రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించామని చెప్పారు. అదేవిధంగా జూలై 30, 31 మరియు ఆగస్టు 1 తేదీల్లో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో వరుణయాగాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వర్షాలు రావడంతో పంటలపై మళ్లీ ఆశలు చిగురించాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోని చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లు, బ్యారేజీలు, ప్రాజెక్టులు నిండిపోయి భూగర్భ జలాలు పెరగాలని, రైతులకు సమృద్ధిగా సాగునీరు అందాలని ఆకాంక్షించారు. సకాలంలో వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో సుభిక్షంగా జీవించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

# జర్నలిస్టుకు జాతీయ వాగ్దేవి పురస్కారం



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి,పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం రూపునారాయణపేటకు చెందిన విద్యాసాగర్ వేములు జాతీయ వాగ్దేవి పురస్కారం అందుకున్నారు. ఢిల్లీలోని ఆంధ్ర అసోసియేషన్ భవన్‌లో జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు వెలుగు సంబరాలు కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అందజేసి ఘనంగా సత్కరించారు. జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి నారాయణరెడ్డి జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు జాతీయ వాగ్దేవి పురస్కారాలను ప్రదానం చేశారు. జర్నలిజం విభాగంలో విద్యాసాగర్ వేములు ఈ గౌరవాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వీ6 వెలుగు (ప్రభాత వెలుగు) ఢిల్లీ ప్రతినిధి వంగ తిరుపతికి కూడా జాతీయ వాగ్దేవి పురస్కారం అందజేశారు. మాజీ మంత్రి పీతాని సత్యనారాయణ, కాశీ విశ్వనాథరాజులకు వాగ్దేవి జీవిత సాఫల్య పురస్కారాలు ప్రదానం చేశారు. కే. లక్ష్మణ్, బీద మస్తాన్ రావు,మాగుంట శ్రీనివాసులు రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వకులభరణం కృష్ణమోహన్ రావు,తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# నైపుణ్యాభివృద్ధి కోర్సుల శిక్షకురాలిగా మహిళల నుండి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/రామగిరి :** 2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల సింగరేణి సేవా సమితి అధ్వర్యంలో నిర్వహించనున్న టైలరింగ్, మగ్గంవర్క్స్, స్పోకెన్ ఇంగ్లీష్, జూట్ బ్యాగ్స్ తయారీ మొదలగు నైపుణ్యాభివృద్ధి కోర్సుల శిక్షకురాలుగా నేర్పించుటకు ఆసక్తి, అర్హత, అనుభవం గల సింగరేణి ఉద్యోగుల కుటుంబ మహిళలు, పరిసర గ్రామాల మహిళల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. దరఖాస్తుతో పాటు సంబంధి త విభాగంలో అనుభవ ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డ్, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు జతచేసి రామగుండం3 ఏరియా జీ.ఎం.కార్యాలయంలోని పర్సనల్ విభాగం నందు తేది: 10.08.2026. సాయంత్రం 5 గంటల లోపు అందజేయాలని కోరారు. ఇతర పూర్తి వివరాలకై ఏరియా పర్సనల్ విభాగం నందు సంప్రదించాలని తెలిపారు.

# అత్యవసర వేళ స్పందించిన రక్తదాత

**ప్రజాపక్షం /మెట్‌పల్లి:** మెట్‌పల్లి పట్టణంలోని కేశవ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వేములకుర్తి గ్రామానికి చెందిన లావణ్యకు అత్యవసర చికిత్స కోసం ఏ పాజిటివ్ (ఎ+) రక్తం అవసరమని వైద్యులు సూచించారు.దీంతో ఆమె కుటుంబ సభ్యులు రక్తదాత కోసం ప్రయత్నించి ఇంద్ర నగర్ బ్లడ్ డోనర్స్ సభ్యుడు భాను చందర్,రక్తదాతల అనుసంధానకర్త ఉదయ్ కుమార్‌ను సంప్రదించారు.వెంటనే సామాజిక సేవకుడు,మహావీర్ డాక్యుమెంట్ రైటర్ యజమాని గోరుమంతుల అరవింద్‌కు సమాచారం అందించగా, ఆయన తక్షణమే స్పందించి కేశవ హాస్పిటల్‌కు చేరుకుని రక్తదానం చేసి మహిళకు అవసరమైన రక్తాన్ని అందించారు.అత్యవసర సమయంలో వెంటనే స్పందించి రక్తదానం చేసిన గోరుమంతుల అరవింద్‌ను రోగి కుటుంబ సభ్యులు,స్థానికులు ప్రత్యేకంగా అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

# గురువే దైవం... గురువే మార్గం...!

**ప్రజాపక్షం/రామగుండం :** గురుపౌర్ణమి సందర్భంగా రామగుండం రైల్వేస్టేషన్ ప్రాంతంలోని శ్రీషిర్డిసాయిబాబా మందిరంలో సాయినాథుడికి పాలాభిషేకం, ప్రత్యేక పూజలు కన్నులపండువగా బుధవారం నిర్వహించారు. మందిరచైర్మన్, మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్ పర్యవేక్షణలో పూజారి శ్రీరాంపెల్లి శ్రీనివాసశర్మ పూజలు చేపట్టారు. భక్తులందరూ స్వామివారికి పాలాభిషేకం చేసి 'ఓంసాయి శ్రీసాయి జయ జయ సాయి' నామస్మరణతో మందిర ప్రాంగణాన్ని భక్తిమయం చేశారు. అనంతరం దాతలు పారుపెల్లి శారదచంద్రన్న, మంద శారదరమేష్ దంపతుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది. వర్షం ఉన్నా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని, సేవకులకు, భక్తులకు సతీష్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలవేణి మల్లేశం, మడక లింగమూర్తి, కె.కె.స్వామి, సిరికొండ కోటి, కోట తిరుపతి, డి.శ్రీలత, బి.రజిని, ఎ.స్వరూప, సునీత, జె.ఉషా, ఎ.శోభారాణిలు పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్

**ప్రజాపక్షం / వాంకిడి :** వర్షాకాలంలో వ్యాధులు వ్యాపించకుండా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ సూచించారు. వాంకిడి మండలంలోని దాంనగర్ గ్రామంలో రాపిడ్ ఫీవర్ సర్వే కార్యక్రమంలో భాగంగా బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. నిల్వ నీటి వల్ల దోమలు పెరిగి మలేరియా, డెంగీ, చికున్ గున్యా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని వివరించారు. వారానికి ఒకరోజు డ్రై డే పాటించి కూలర్లు, టబ్బులు, పూలకుండీలు, ఇంటి పరిసరాలను శుభ్రపరిస్తే దోమల వ్యాప్తిని నివారించవచ్చని తెలిపారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, పొలాలకు వెళ్లేవారు స్వచ్ఛమైన తాగునీటిని వెంట తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం నిర్వహించిన వైద్య శిబిరంలో 51 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించగా, జ్వర లక్షణాలు ఉన్న 5 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపించారు. బాధితులకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ ప్రమీల, డాక్టర్ రియాజ్, దివ్య, ఏఎన్ఎం రాఘవి, అంగన్వాడీ టీచర్లు ఉష, లక్ష్మి, వాలంటీర్ నీరజ పాల్గొన్నారు.

## బండొర్రె బ్రిడ్జి హామీ ఏమైంది?

ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ పటేల్

**ప్రజాపక్షం / జన్నారం :** ఖానాపూర్ ఎంఎల్ఏ బొజ్జు గత వర్షాకాలంలో ఇచ్చిన బండొర్రె బ్రిడ్జి హామీ సంవత్సరం కావస్తున్నా నెరవేరకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని నేషనల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ పటేల్ విమర్శించారు. జన్నారం మండలంలోని రొటిగుడా ప్రధాన రహదారిపై ఉన్న బండొర్రె వద్ద బ్రిడ్జి నిర్మిస్తామని ఎంఎల్ఏ ఇచ్చిన హామీ మాటలకే పరిమితమైందని ఆరోపించారు. చిన్నపాటి వర్షానికే బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి, విద్యార్థులు పాఠశాలలకు కూడా వెళ్లలేని దయనీయ పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్లుగా గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కనీసం పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జిని వెంటనే నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం వీడకుంటే గ్రామ ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## మున్సిపల్ కమిషనర్‌పై దాడి హేయం

**ప్రజాపక్షం / రామకృష్ణాపూర్ :** వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణపై మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త రాజారమేష్, బీఆర్ఎస్ నాయకులు అనుచితంగా ప్రవర్తించి దాడికి పాల్పడడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ తెలిపారు. రామకృష్ణాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అధికారులు విధి నిర్వహణలో అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు.

## నాపై వచ్చిన వార్తలు అవాస్తవం

ఐఎన్‌టియుసి సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్రావు

**ప్రజాపక్షం / నస్పూర్ :** ఇటీవల తనపై కొన్ని పత్రికల్లో ప్రచురితమైన వార్తలు పూర్తిగా అవాస్తవమని, నిరాధార ఆరోపణలతో కూడుకున్నవని ఐఎన్‌టియుసి సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్రావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత శుక్రవారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో తనపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి తాను ఇప్పటికే న స్పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆ ఘటనకు కారణమైన వ్యక్తి కావాలనే తనపై అసత్య ఆరోపణలు చేస్తూ, దుష్ప్రచారం నిర్వహించి కొన్ని పత్రికల్లో తప్పుడు వార్తలు ప్రచురింపజేశారని ఆరోపించారు. వ్యక్తిగత ఆర్థిక అవసరాల దృష్ట్యా కొంతమంది వద్ద అప్పులు తీసుకున్న విషయం వాస్తవమేనని, వారికి విడతల వారీగా చెల్లింపులు చేస్తున్నానని చెప్పారు. ఇంకా చెల్లించాల్సిన వారికి కూడా తప్పకుండా చెల్లిస్తానని స్పష్టం చేశారు. తన వద్ద నుంచి పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదును ఉపసంహరించుకోవాలని మధ్యవర్తుల ద్వారా ఒత్తిడి తీసుకొచ్చారని, తాను అందుకు అంగీకరించకపోవడంతోనే తనపై సామాజికంగా కుట్రలు పన్ని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బదిలీలు, మెడికల్ పైరవీలు లేదా ఇతర పనుల పేరుతో ఎవరి వద్ద నుంచి కూడా ఒక్క రూపాయి తీసుకోలేదని స్పష్టం చేశారు. ఈ అంశంపై ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. తన వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా తప్పుడు ఆరోపణలు చేస్తూ అసత్య ప్రచారం సాగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని జెట్టి శంకర్రావు హెచ్చరించారు.

### విచారణలో తేలాల్సిన అంశాలు

కాగా, ఇటీవల వెలుగులోకి వచ్చిన ఆరోపణలపై బాధితుల ఫిర్యాదులు, జెట్టి శంకర్రావు వివరణ ప్రస్తుతం పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. వాస్తవాలు పోలీసుల దర్యాప్తు, విచారణలో తేలాల్సి ఉంది. ఇప్పటికీ ఆయనపై స్థానిక పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు వస్తున్నట్లు పోలీస్ అధికారులు తెలుపుతున్నారు. వచ్చిన ఫిర్యాదులను ఆధారంగా చేసుకొని దర్యాప్తు చేస్తామని వెల్లడించారు.

## తెలంగాణ ఉద్యమంలో అమరులను ప్రభుత్వం గుర్తించాలి

టిజెఎసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్ మార్వాడి



**ప్రజా పక్షం/భైంసా :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆత్మ బలిదానాలు చేసుకున్న నిర్మల్ జిల్లా ,భైంసా, ముధోల్ నియోజకవర్గాల అమరులను ప్రభుత్వం అధికారికంగా గుర్తించి, వారికి ప్రకటించిన సంక్షేమ పథకాలు, ఆర్థిక సహాయం అందించాలని టీజేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్ మార్వాడి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నిర్మల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ముప్పు రామకృష్ణ గౌడ్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.ముధోల్ నియోజకవర్గాల్లో తెలంగాణ ఉద్యమ కాలంలో ఆత్మబలిదానాలు చేసుకున్న అమరుల కుటుంబాలను గుర్తింపు కమిటీ మొదటి ప్రాధాన్యంతో గుర్తించి, ప్రభుత్వం ప్రకటించిన అన్ని సంక్షేమ పథకాలు, ఆర్థిక సహాయం అందించాలని వారు కోరారు.తెలంగాణ ఉద్యమంలో ఆత్మబలిదానం చేసుకున్న ఐదుగురు అమరులలో ఇద్దరికి మాత్రమే అప్పటి తెరాస ప్రభుత్వం రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించగా, మిగిలిన ముగ్గురికి ఇప్పటి వరకు ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదని వారు పేర్కొన్నారు. అందువల్ల ప్రభుత్వం వెంటనే స్పందించి, మిగిలిన అమరుల కుటుంబాలకు కూడా సమాన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా, తెలంగాణ ఉద్యమ సమయంలో పోలీసు కేసులు నమోదైన ఉద్యమకారులు, బైండోవర్‌కు గురైన వారు, జేఏసీ ఆధ్వర్యంలో ముందుండి ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను అధికారికంగా గుర్తించి, వారికి కూడా తగిన గౌరవం, ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన ప్రతి అమరుడికి సమాన గుర్తింపు, గౌరవం, ప్రభుత్వం ప్రకటించిన అన్ని సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ప్రభుత్వాన్ని కోరింది. ప్రభుత్వ సహాయం అందని అమరులునాంపల్లి భాస్కర్, సోనార్ గల్లి, భైంసాతోపాయి రవి,కొర్బగల్లి, భైంసాసల్లెందుల యోగేష్, కొర్బగల్లి,భైంసా అప్పటి తెరాస ప్రభుత్వం రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించిన అమరులుపాపిన్వార్ శైలేందర్ – పురానా బజార్,భైంసాపద్దె గంగాధర్ – పిప్రి గ్రామం,లోకేశ్వరం మండలంఈ సమావేశంలో తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి గుర్రాల రవీందర్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రచయితల సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షులు పుండలిక్ రావు,తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కార్యదర్శి చాకేటి లక్ష్మన్న,తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ ఫిర్యాదుపై తక్షణ స్పందన

జిల్లా ఎస్పి డా.జి.జానకి షర్మిల



**ప్రజా పక్షం/భైంసా :** భైంసా పట్టణంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఆర్జిదారుల ఫిర్యాదులను స్వీకరించి, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించారు.ఫిర్యాదు దారుల ఎదుటే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**కుటుంబ వివాదాల పరిష్కారంలో 'షీ టీం' పాత్ర :** ఈ కార్యక్రమంలో వచ్చిన కొన్ని కుటుంబ సమస్యలపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ ద్వారా కుటుంబాలు తిరిగి కలుసుకోవడం జరిగింది. నిర్మల్ వరకు రావడం కష్టంగా ఉండగా, భైంసాలోనే కౌన్సిలింగ్ కల్పించడం పై ఎస్పీ గారు చూపిన ఆలోచనను బాధితులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

**పెండింగ్ ఫిర్యాదులపై సమీక్ష :** ఈ సందర్భంగా గతంలో గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితి, ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని పెండింగ్ లో ఉన్న వాటిని వేగంగా పరిష్కరించాలన్నారు.

## వైభవంగా వ్యాస పూర్ణిమ వేడుకలు



**ప్రజా పక్షం/భైంసా :** బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి క్షేత్రంలో వ్యాస పూర్ణిమ వేడుకలు వైభవ పేతంగా జరిగాయి. బుధవారం వ్యాస పూర్ణిమను పురస్కరించుకొని ఎమ్మెల్యే పవా ర్ రామరావు పటేల్,మాజీ కేంద్రమంత్రి వేణుగోపాల చారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు చేపట్టిన యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆలయ అధికారులు, ప్రధాన అర్చకులు ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఎమ్మెల్యేతో పెద్ద మొత్తంలో సర్పంచులు,బిజెపి నాయకులు, పాల్గొన్నారు.

## విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలి

మండల విద్యాధికారి నానాజీ

**ప్రజాపక్షం / కౌటాల :** ఎస్సీఈఆర్టీ తెలంగాణ ఆధ్వర్యంలో అమలవుతున్న విద్యా కార్యక్రమాలను ప్రతి పాఠశాలలో సమర్థవంతంగా అమలు చేయాలని మండల విద్యాధికారి జి. నానాజీ సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మూడు రోజుల ఇంటిగ్రేటెడ్ ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం ద్వారా రాష్ట్రం జాతీయ స్థాయిలో 36వ స్థానం నుంచి 26వ స్థానానికి చేరుకోవడం ఉపాధ్యాయుల కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యాస లోపాలను అధిగమించేందుకు రెమిడియేషన్ కార్యక్రమాన్ని పాఠశాల స్థాయిలో అమలు చేయనున్నట్లు తెలిపారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బి. రామ్ చందర్, జిల్లా రిసోర్స్ పర్సన్ ఎన్. శ్రీనివాస్, మండల రిసోర్స్ పర్సన్లు ఆర్. సునీల్, తిరుపతి, రావుజి, ఎం. సంజయ్ కుమార్‌తో మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గిరిజనులకు సాయిభోజన్ అన్నదానం

**ప్రజాపక్షం / బెల్లంపల్లి టౌన్ :** గురుపౌర్ణమిని పురస్కరించుకుని మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గం తాండూరు మండలం కర్నల ఘట్టం గ్రామంలో గిరిజనులకు, అన్నార్తులకు సాయిభోజన్ అన్నదానం చేసినట్లు బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. సనాతన ధర్మ బాయిజమ్మ సాయి భక్తి ప్రచార ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో బుధవారం మధ్యాహ్నం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయినాథుని ఆశీర్వాదంతో, బాయిజమ్మ ఆలోచనా మార్గంలో నడుస్తూ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, వారం వారం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మహా అన్నదానంతో పాటు పలు సందర్భాలలో గిరిజన, పేద గ్రామాలలో అన్నదానం, దుప్పట్లు, బట్టల పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఆకలితో ఉన్నవారిని ఆదరించి అన్నదానంతో తృప్తి పరుద్దామని, సేవా కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్, సభ్యులు రాజేశ్వరి, జెరిపోతుల చంద్రకళ, నల్ల శ్రీనివాస్, మధుకర్, శ్రీనివాస్, త్రయంబక్, సేవకులు వెంకటేష్, సిద్ధార్థ, నరేష్, సతీష్, తిరుపతి, యూసఫ్, డాక్టర్ పేరం రమేష్, గ్రామ పెద్ద పెంద్రం రామ్ పటేల్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పులుల సంరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలి

**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** పులులు అడవులను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని, అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అటవీ శాఖ అధికారి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా సిర్పూర్ టి మండల కేంద్రంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పులుల సంరక్షణ, అడవుల పరిరక్షణ, జీవ వైవిధ్య ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ విద్యార్థులు నిర్వహించిన ర్యాలీ ఆకట్టుకుంది. అనంతరం జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సదాశివుడు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు ప్రవీణ్ కుమార్, తిరుపతి, సెక్షన్ ఆఫీసర్లు మోహన్, బీట్ ఆఫీసర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, ఫారెస్ట్ వాచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ కాస్తా శాపమైంది!

**ప్రజాపక్షం / లక్సెట్టిపేట :** లక్సెట్టిపేట పట్టణంలో జరుగుతున్న రోడ్డు వెడల్పు పనులు స్థానిక వ్యాపారులకు ఆర్థిక నష్టాన్ని, ప్రజలకు నిత్య నరకాన్ని మిగులుస్తున్నాయి. పట్టణ ప్రాధాన్యతను పెంచేందుకు చేపడుతున్న విస్తరణ పనులు, సరియైన ప్రణాళిక లేకపోవడం వల్ల ప్రజలకు, వ్యాపారులకు తీవ్ర కష్టాలను తెచ్చిపెడుతున్నాయి. దుకాణాల ముందే గుంతలు తవ్వి వదిలేయడం, నిర్మాణ సామగ్రిని ఇష్టారాజ్యంగా నిల్వ చేయడంతో కొనుగోలుదారులు షాపుల వైపు రావడానికే భయపడుతున్నారు. వ్యాపార లావాదేవీలు పూర్తిగా మందగించడంతో జీవనోపాధి దెబ్బతిని తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక వ్యాపారులు వాపోతున్నారు. మరోవైపు ప్రత్యామ్నాయ మార్గాలు సూచించకుండా పనులు చేపట్టడంతో నిత్యం ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభిస్తోంది. పనుల వల్ల లేచే విపరీతమైన దుమ్ముతో వాహనదారులు, బాటసారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, సమయానికి కార్యాలయాలకు చేరుకోవాల్సిన ఉద్యోగులు, వృద్ధులు రాకపోకలు సాగించలేక సతమతమవుతున్నారు.

## ఉప్పొంగిన పొచ్చేర జలపాతం



ప్రజాపక్షం/బోథ్ : బోథ్ మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. మంగళవారం నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంటచేలునీళ్లతోనిండిపోతున్నాయి.మరోవైపు వివిధ గ్రామాల సమీపంలోని వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి.మండలంలోని పోచ్చర జలపాతానికి వరద పోటెత్తింది. దీంతో జలపాతం నిండు కుండలా ఉప్పొంగి ప్రవహిస్తున్నది. వివిధ ప్రాంతాల నుండి జలపాతం సందర్శించేందుకు పర్యాటకులు భారీ సంఖ్యలో వస్తున్నారు పర్యాటకుల రాక పెరగడంతో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా అధికారులు చర్యలు చేపట్టారు.

## ఘనంగా గురు పౌర్ణమి వేడుక

ప్రజాపక్షం/సారంగాపూర్ : మండల కేంద్రంలోని స్వాత్మ రామాలయంలో గురు పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయంలో ఉదయం నుండి ధూప దీప నైవేద్యాలు సమర్పించి జెండాను ఆవిష్కరించారు. రాత్రి వేళలో భజన కార్యక్రమాలు ఏర్పాటు చేయగా ఆలయానికి వచ్చే భక్తులకు భోజనాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఆలయ నిర్వాహకులు మంచాల రాములు,ఆడెపు లక్ష్మి,ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు,తదితరులు పాల్గొన్నారు.

## బాసర లో గోశాలల నిర్మాణానికి 20 లక్షల రూపాయల నిధులు

ప్రజాపక్షం/భైంసా : బాసర జ్ఞానసరస్వతి అమ్మ వారి క్షేత్రం లో కృష్ణ మందిరం, వేద పాఠశాలలో గోశాల ల నిర్మాణానికి ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ భూమి పూజ చేశారు.బుధవారం వ్యాస పూర్ణిమ సందర్భంగా బాసర సరస్వతి అమ్మ వారి ఆలయం లో పూజలు నిర్వహించిన అనంతరం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గోశాలల నిర్మాణం చేపడతామన్నారు.అనంతరం సరస్వతి శిశు మందిర్ పాఠ శాల భవన నిర్మాణ పనులు ప్రారంభించి మొక్కలను నాటారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## శ్రీహరి రావుకు 'శిశు మందిర్' ఆధ్వర్యంలో చిరు సన్మానం

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీహరి రావును బాగులవాడలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ కాన్సెప్ట్ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించాయి. బుధవారం పాఠశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనకు మర్యాదపూర్వకంగా చిరు సన్మానం నిర్వహించారు. పాఠశాల ప్రతినిధులు ఆయనను శాలువాతో కప్పి, పూలమాల వేసి జ్ఞాపికను అందజేశారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సత్ప్రవర్తన, పాఠశాల అభివృద్ధికి అందిస్తున్న సహకారాన్ని శ్రీ సరస్వతి శిశు మందిర్ కాన్సెప్ట్ స్కూల్ నిర్వహకులు,ఉపాధ్యాయులు,పాల్గొన్నారు.

# వర్షపాతం వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలి

కలెక్టర్ భవేశ్ మిశ్రా



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : జిల్లా వ్యాప్తంగా నమోదయ్యే వర్షపాతం వివరాలను ఖచ్చితత్వంతో ఎప్పటికప్పుడు నమోదు చేసి సంబంధిత శాఖలకు సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.బుధవారం పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భూగర్భ జలాల కొలతల కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షపాతం, భూగర్భ జలాల వివరాల నమోదు విధానాన్ని పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా వివరాలను నమోదు చేయాలని సూచించారు.అనంతరం నిర్మల్ గ్రామీణ మండలం అక్కాపూర్ గ్రామంలోని విద్యుత్ ఉపకేంద్రం ప్రాంగణంలో ఉన్న వర్షపాత మాపక కేంద్రంను తనిఖీ చేశారు. వర్షపాతం కొలత, నమోదుకు అనుసరిస్తున్న విధానం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.వర్షపాతం వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడంతో పాటు సంబంధిత శాఖలకు వేగంగా చేరవేయాలని ఆదేశించారు. ప్రతి నమోదు శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.అనంతరం ఎల్లపల్లి సమీపంలోని నిర్మాణంలో ఉన్న నూతన కలెక్టర్ క్యాంపు కార్యాలయాన్ని పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి, పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

# ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు నిర్వహణ



ప్రజా పక్షం/భైంసా : భారతీయ సంస్కృతిలో గురువుకు దైవం కంటే ఉన్నతమైన స్థానం ఉందని చాటి చెప్పే పవిత్ర పర్వదినమైన గురుపౌర్ణమి సందర్భంగా గోపాల్ రావు పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల,భైంసాలో హిందీ విభాగం ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.కార్యక్రమాన్ని మహర్షి వేదవ్యాసుల చిత్రపటానికి పూలమాలలు వేసి, దీపప్రజ్వలనతో ప్రారంభించారు.ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. కె. రఘునాథ్ మాట్లాడుతూ, గురుపౌర్ణమి అనేది కేవలం ఒక పండుగ మాత్రమే కాదని,భారతీయ జ్ఞాన సంప్రదాయానికి ప్రతీక అని అన్నారు.వేదాలను నాలుగు భాగాలుగా విభజించి, అష్టాదశ పురాణాలు,బ్రహ్మసూత్రాలు,మహాభారతం వంటి మహాగ్రంథాలను రచించిన మహర్షి వేద వ్యాసుడు ప్రపంచానికి అందించిన జ్ఞాన సంపద్ద చిరస్మరణీయమని కొనియాడారు.అందుకే ఆయనను జగద్గురుగా ఆరాధిస్తూ ప్రతి సంవత్సరం ఆషాఢ పౌర్ణమి రోజున గురుపౌర్ణమిని జరుపుకుంటామని వివరించారు.హిందీ విభాగాధిపతి డా. పవన్ కుమార్ మాట్లాడుతూ, అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానమనే వెలుగును నింపేవారే గురువులని అన్నారు. విద్య అనేది పుస్తకాలలో మాత్రమే ఉండదని, మంచి వ్యక్తిత్వాన్ని, విలువలను,క్రమశిక్షణను,మానవత్వాన్ని నేర్పేది గురువేనని పేర్కొన్నారు.ప్రతి మనిషి విజయానికి వెనుక ఒక గొప్ప గురువు ఉంటాడని, గురువుల పట్ల గౌరవం, కృతజ్ఞత ప్రతి విద్యార్థి జీవితాంతం నిలుపుకోవాలని సూచించారు.అనంతరం డా. జె. భీమారావు మాట్లాడుతూ, ప్రతి వ్యక్తికి తొలి గురువులు తల్లిదండ్రులేనని, విద్యాబుద్ధులు నేర్పి జీవితానికి దిశానిర్దేశం చేసేవారు ఉపాధ్యాయులని తెలిపారు. గురువు ఆశీస్సులు,మార్గదర్శనం ఉన్నచోటే నిజమైన విజయం సాధ్యమవుతుందని అన్నారు.

# కాపర్ వైర్ దొంగలించిన వ్యక్తి అరెస్ట్

వివరాలు వెల్లడించిన సిఐ ప్రవీణ్ కుమార్



ప్రజా పక్షం/బైంసా : తేదీ 27–07–2026 న కైలాష్ ఫ్యాక్టరీ ఏరియ యందు గల నిర్మాణం లో ఉన్న తన ఇంటికి తాళం వేసి తన పాత ఇంటికి వెళ్ళినాడు తిరిగి తేది 28–07–2026 న ఉదయం తన కొత్త ఇంటికి వెళ్లి చూడగా ఇల్లు యొక్కతాళం పగులగొట్టి ఇంటి తలుపులు తెరిచి ఎవరో గుర్తుతెలియని దొంగలు ఇంటిలో ఉన్న కరెంట్ వైర్ ను కత్తిరించి గోడలలో నుండి లాగి ఎత్తుకెళ్లి నారని తనకు సుమారు రూపాయలు 10,000/ విలువ గల కరెంట్ వైర్ కరెంట్ వైర్ లాగడం వలన సుమారు 1,00,000/ వరకు పిఐపి నష్టం జరిగింది అని దరకాస్తు ఇవ్వనైనది. దర్యాప్తులో భాగంగా పరిసర ప్రాంతాల నుండి సీసీటీవీ ఫుటేజీలు సేకరించి విశ్లేషించడం జరిగింది దర్యాప్తులో బాగంగా నిందితులు భైంసా పట్టణంలోని కద్ద హోటల్ దగ్గరలో ఆఫీస్ ఎదురుగ గల పాత ఇనుప సామాను దుకాణం నడిపే వ్యక్తి ఇట్టి దొంగిలించిన కాపర్ వైర్ కొంటారని తెలిసి పోలీస్ సిబ్బంది అక్కడికి వెళ్ళగా పోలీస్ సిబ్బందిని చూసి ఇద్దరు వ్యక్తులు అక్కడి నుండి పారిపోయారు పోలీస్ వారు షాప్ లో ఉన్న వ్యక్తిని పట్టుకొని విచారించగా షాప్ ఓనర్ షేక్ నజీర్, అట్టి దొంగ సొత్తును కల్గి ఉండగా, అట్టి దానిని ఇద్దరు మైనర్ బాలుర చేత దొంగతనం చేయించినదని తెలిసినది. గతంలో కూడా పలుమార్లు ఇట్టి దొంగసొత్తు ను అతను కొంటున్నాడు.స్వాధీనం చేసుకున్న వస్తువులు 1. 07 కెజీ కాపర్ వైర్ (కైలాష్ ఫ్యాక్టరీ ఇంటి నుండి )2. 30 కెజీ కాపర్ వైర్ ( గతం లో కొన్నది)3. 7 కెజీ 200 జీఆర్ వైర్ బిండలు (గతం లో కొన్నది )4. సిసిఎల్ 1 ఐటి వద్ద 4 కెజీ కాపర్ వైర్ (గతం లో దొంగతనం చేసినది)ఈ కేసును శాస్త్రీయ ఆధారాలు, సీసీటీవీ విశ్లేషణ, క్షుణ్ణమైన దర్యాప్తు ద్వారా స్వల్ప వ్యవధిలో ఛేదించడం జరిగింది. కేసుకు సంబంధించిన తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.ఈ కేసుకు సంబంధించిన వివరాలను ASP భైంసా , ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, భైంసా టౌన్ మీడియా సమావేశంలో వెల్లడించారు.

## లోతట్టు ప్రాంతాల్లో పర్యటించిన మేయర్

ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ నగరంలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో టూ టౌన్ సమీపంలోని నాలా, మంచిర్యాల్ చౌరస్తా నాలా, వి–పార్క్ సమీపంలోని నాలాతో పాటు నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలను నగర మేయర్‌కోలగాని శ్రీనివాస్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద చేపట్టిన డ్రైనేజీ, వరద నీటి పారుదల పనుల పురోగతిని సమీక్షించిన మేయర్, పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వర్షపు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శాశ్వత పరిష్కారాల దిశగా అధికారులు పనిచేయాలని సూచించారు. నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి అత్యవసర చర్యలు తీసుకోవాలని, అవసరమైతే అదనపు యంత్రాంగాన్ని వినియోగించి నీటి పారుదల వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ యంత్రాంగం, డీఆర్ఎఫ్ బలగాలు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.

# పారదర్శకంగా క్వార్టర్ల కేటాయింపు

ఎస్ఓ టు జీఎం జీఎల్ ప్రసాద్

ప్రజాపక్షం / మందమర్రి : మందమర్రి ఏరియాకు చెందిన నేషనల్ కోల్ వేజ్ అగ్రిమెంట్ ఉద్యోగులకు సీనియారిటీ ప్రాతిపదికన పారదర్శకంగా క్వార్టర్ల కేటాయింపు కౌన్సెలింగ్ నిర్వహించారు. మందమర్రిలోని స్థానిక సిఇఆర్ క్లబ్ ఆవరణలో బుధవారం ఈ కౌన్సెలింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఓ టు జీఎం జీఎల్ ప్రసాద్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ విజయ్ సందీప్ మాట్లాడుతూ ఏరియాలో మొత్తం 88 క్వార్టర్లు అందుబాటులో ఉండగా, వాటి కోసం 80 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. నిబంధనల ప్రకారం సీనియారిటీ ప్రాతిపదికన పారదర్శక పద్ధతిలో కౌన్సెలింగ్ నిర్వహించి 14 మంది అర్హులైన ఉద్యోగులకు క్వార్టర్లను కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కార్తీక్, కె. శ్యామ్ కుమార్, ఐఇడి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మేనేజ్మెంట్ ట్రైనీ సివిల్ ఆర్. వీణ, పర్సనల్ విభాగం సిబ్బంది పాల్గొని కేటాయింపు ప్రక్రియను పర్యవేక్షించారు.

## అంగన్వాడీ ఉపాధ్యాయురాలి సేవలు ప్రశంసనీయం

ప్రజాపక్షం / రెబ్బెన : గత 25, 30 ఏళ్లుగా అంగన్వాడీ ఉపాధ్యాయురాలిగా పసిపిల్లలకు, గర్భిణులకు చంద్రకళ ఎనలేని సేవలు అందించారని లయన్స్ క్లబ్ ఆఫ్ గోలేటి స్పోర్ట్స్ అధ్యక్షుడు దీకొండ సంజీవ్ కుమార్ కొనియాడారు. గురుపూజోత్సవం సందర్భంగా రెబ్బెన మండల కేంద్రంలో అంగన్వాడీ ఉపాధ్యాయురాలు చంద్రకళను బుధవారం ఆయన ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అంగన్వాడీ టీచర్లు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డి విజయ్ కుమార్, పాఠశాల డైరెక్టర్ హిమబిందు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మంజు, నవ్య, అరుణ, మేఘన, నీలిమ పాల్గొన్నారు.

## శిశు మందిర్‌లో గురు (వ్యాస) పౌర్ణమివేడుకలు

ప్రజాపక్షం/బోథ్ : బోథ్ పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో గురు పౌర్ణమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండ రాజేంద్ర గౌడ్ మాట్లాడుతూ గురుపౌర్ణమి, గురువులు,ఉపాధ్యాయులను గౌరవించడానికి అంకితం చేయబడిన రోజు అని,గురువులు ,జీవితంలో సరైన మార్గాన్ని చూపి మీకు జ్ఞానాన్ని అందిస్తారని,హిందూ గ్రంథాల ప్రకారం ముఖ్యమైన గురువులలో ఒకరైన మహర్షి వేదవ్యాస జన్మదినోత్సవ రోజును గురు పౌర్ణమి గా జరుపుకుంటారు అని తెలిపారు.గురువు మార్గదర్శకత్వం లేకుండా మన చుట్టూ ఉన్న చీకటిని ,అజ్ఞానాన్నినిర్మూలించడం కష్టమని విద్యార్థులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## సరస్వతీ శిశు మందిర్ గుజిరిగల్లి పాఠశాలలో గురు పూర్ణిమ వేడుకలు



ప్రజాపక్షం/బైంసా : శ్రీ సరస్వతీ శిశు మందిర్ గుజిరిగల్లి పాఠశాలలో గురు పూర్ణిమ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నాము.ఈ కార్యక్రమంలో పూర్వాఅచార్యి దోంతుల గంగాధర్ కి తోటరాము గణేశ్ నగర్ భైంసా మున్నురు కాపు సంఘం అధ్యక్షులు కి,ఆచార్యులు బృందానికి కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించడం జరిగింది.ప్రభంధకారిణి సభ్యులు మాట్లాడుతూ విశ్వ గురువు వేద వ్యాసుడు ఎందరో గురువులు తమ శక్తినంత ధారపోసి శిష్యులను తమ ప్రయోజకులుగా చేశారు.దేశ ధర్మాలను,సంస్కృతి సాంప్రదాయం రక్షించడంలో ముందు నిలిచారు.వేదా వ్యాసుడు ఆషాఢపౌర్ణమి రోజున జన్మించాడు పుట్టిన తేదీ కనుక వ్యాస పౌర్ణమి జరుపుకుంటారు.వేదవ్యాసుడు వేదాలను,ఋగ్వేదం,యజుర్వేదం,సామ,వేదం, అధ్వరణ ,వేదాలను రచించారు.శ్రీ భగవాన్ వేదవ్యాసులరచనా, దక్షతకు నిదర్శనం,సకలశాస్త్ర లకు వేదాలువిజ్ఞానం లోనే ఉంది. వాటిని మానవాళికి అందించిన వేదవ్యాసుడు విశ్వా నికంతటికి గురువు గురుదేవుడిగా ఈజ్ఞాన పరంపర ఏర్పడింది.ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు డి శ్రీధర్,పెండేప్ కాశీనాథ్,కార్యదర్శి దోంతుల గంగాధర్ సమితి,సహకారదర్శి గుజ్జులవార్ లక్ష్మణ్ ,సమితి కోశాధికారి తోట రాము,సహకార్యదర్శి ,ప్రముఖ వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్,మాతృమూర్తులు,ప్రధాన ఆచార్యులు రాముల గంగాధర్,ఆచార్యులు,పోషకులు విద్యార్థులు,పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యం...ప్రభుత్వ పథకాలకు గండి పడే ప్రమాదం!

### ఫార్మర్ రిజిస్ట్రీ మిగిలిన 18 శాతంపై నిర్లక్ష్యం ఎందుకు?




**ప్రజాపక్షం /నిర్మల్ :** ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఫార్మర్ రిజిస్ట్రీ' (రైతు డిజిటల్ ఐడీ) నమోదు ప్రక్రియ నిర్మల్ జిల్లాలో అధికారుల నిర్లక్ష్యం,అలసత్వం కారణంగా గమ్యస్థానానికి చేరుకోలేకపోతోంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 81.53 శాతం మేర నమోదు ప్రక్రియ పూర్తయిందని అధికారులు గణాంకాలు చూపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం దానికి భిన్నంగా ఉంది. ఇప్పటికీ వేలాది మంది రైతులు ఈ డిజిటల్ గుర్తింపు పొందేందుకు తిప్పలు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అధికారులు నమోదు ప్రక్రియ పూర్తి అయిపోయినట్లే భావించి చేతులు దులుపుకుంటుండటంతో, ఇప్పటివరకు నమోదు కాని మిగిలిన 18.47 శాతం రైతుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.జిల్లా పరిధిలోని 19 మండలాల వ్యాప్తంగా ఉన్న మొత్తం 1,98,988 మంది పట్టాదారు రైతులలో ఇప్పటివరకు 1,62,236 మంది మాత్రమే ఆన్‌లైన్ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకుని 'డిజిటల్ ఐడీ' పొందగలిగారు. అంటే ఇంకా 36,752 మంది రైతుల సమాచారం పెండింగ్‌లోనే మూలుగుతోంది. మండలాల వారీగా పరిశీలిస్తే అధికారుల పనితీరులోని వ్యత్యాసాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. లోకేశ్వరం మండలంలో 91.48 శాతం, సోన్ మండలంలో 88.13 శాతం నమోదు పూర్తయి ముందంజలో ఉండగా.. కడెం పెద్దూర్ (75.09%), మామడ (75.97%), కుబీర్ (76.48%) వంటి మండలాల్లో నమోదు శాతం దారుణంగా పడిపోయింది. ఆయా మండలాల్లో యంత్రాంగం కనీస స్పందన కనబరచకపోవడంపై స్థానిక రైతాంగం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది.ఈ పరిస్థితికి క్షేత్రస్థాయి అధికారుల పర్యవేక్షణా లోపమే ప్రధాన కారణమని స్పష్టమవుతోంది. గ్రామాల్లో ఏవోలు (AEOs), ఏఈఓలు రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ ప్రాముఖ్యతపై సరిగ్గా అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు. భూముల సర్వే నంబర్ల మ్యాపింగ్, పాస్‌పుస్తకాల్లో తప్పులు, ఆధార్ లింకింగ్ సమస్యలు ఉన్న రైతులకు సహాయం అందించాల్సిన వ్యవసాయ శాఖ సిబ్బంది కనీసం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఏజెన్సీ సరిహద్దు గ్రామాలు మరియు భూ వివాదాలు ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయకపోవడం వల్ల వేలాది మంది పేద రైతులు ఈ ప్రక్రియకు దూరంగా ఉండిపోవాల్సి వచ్చింది.రైతు ఆధార్, సెల్‌ఫోన్ నంబరు, పట్టాదారు పాస్‌పుస్తకం, సాగు వివరాలను అనుసంధానించి కేటాయించే 11 అంకెల 'యూనిక్ డిజిటల్ ఐడీ' కేవలం ఒక కార్డు మాత్రమే కాదు. రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పీఎం కిసాన్ నిధులు, పంట రుణాలు, విత్తన మరియు ఎరువుల సబ్సిడీలు, ఇన్సూరెన్స్ పరిహారం నేరుగా పొందాలంటే ఈ రిజిస్ట్రేషన్ అత్యంత తప్పనిసరి. సాంకేతిక లోపాలు, అధికారుల ఉదాసీనత వల్ల రిజిస్ట్రేషన్ కాకపోతే రాబోయే రోజుల్లో పథకాలన్నీ నిలిచిపోయి ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తింటామని రైతులు ఆవేదన చెందుతున్నారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మరియు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి. నమోదు శాతంలో వెనుకబడిన కడెం, మామడ, కుబీర్ వంటి మండలాలపై ప్రత్యేక దృష్టి సారించి, గ్రామ స్థాయిలో డిజిటల్ క్యాంపులు నిర్వహించాలి. పెండింగ్‌లో ఉన్న 36 వేల మందికి పైగా రైతులకు డిజిటల్ ఐడీలు అందేలా చర్యలు తీసుకుని,నిర్మల్ జిల్లాను 100 శాతం ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తయిన జిల్లాగా నిలబెట్టాలని రైతాంగం గట్టిగా డిమాండ్ చేస్తోంది.

# అక్రమార్కులకు అడ్డాగా కుబీర్ మండల విద్యాశాఖ

### ఎస్ఎస్ఎస్, యుఎస్ఎఫ్ఐ నాయకుల ధ్వజం



**ప్రజాపక్షం/భైంసా :** కుబీర్ మండల విద్యాశాఖ కార్యాలయం అక్రమాలకు,అక్రమ డిప్యూటేషన్లకు నిలయంగా మారిందని సంఘర్షణ సమితి నిర్మల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శీతల్కర్ అరవింద్,యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామత్కర్ నవీన్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మండల విద్యాధికారి నిర్లక్ష్య వైఖరికి కుప్టి ప్రాథమికోన్నత పాఠశాల ఉదంతమే ప్రత్యక్ష నిదర్శనమని ఆరోపించారు. కుప్టి పాఠశాలకు 2024లో బదిలీపై వచ్చిన కవిత అనే ఉపాధ్యాయురాలు నాటి నుండి ఇప్పటివరకు పాఠశాలకు అసలు హాజరు కాకుండానే ప్రతినెల క్రమం తప్పకుండా జీతం పొందుతున్నారని వారు వివరించారు. ఉపాధ్యాయురాలు విధులకు రాకపోయినా జీతం చెల్లిస్తుండటం వెనుక మండల విద్యాధికారికి ముడుపులు అందాయనే అనుమానాలు నిజమని స్పష్టమవుతోందన్నారు.2025–26 విద్యా సంవత్సరం ముగింపు దశలో తేదీ లేనటువంటి, జిల్లా విద్యాశాఖ అధికారి సంతకంతో కూడిన డిప్యూటేషన్ ఆర్డర్‌ను సృష్టించడం వెనుక పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని మండిపడ్డారు. కవిత అనే ఉపాధ్యాయురాలిని నియోజకవర్గం సరిహద్దులు దాటించి పెరి మండలం పాఠశాలకు డిప్యూటేషన్ పేరిట పంపడం వెనుక ఎంఈఓ విజయ్ కుమార్ అహంకార ధోరణి కొట్టొచ్చినట్లు కనిపిస్తోందన్నారు. ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 23న విడుదల చేసిన జీవో ప్రకారం ముందస్తు అనుమతి లేదా లీవ్ మంజూరు లేకుండా విధులకు హాజరు కాని ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, ఆ నిబంధనలను అధికారులు పూర్తిగా తుంగలోకి తొక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ అక్రమ డిప్యూటేషన్ల వల్ల కుప్టి పాఠశాలలో 2025 26లో 56గా ఉన్న విద్యార్థుల సంఖ్య ప్రస్తుతం 35కు పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలోని 6, 7 తరగతుల్లో 8 నుంచి 10 మంది విద్యార్థులు ఉన్నందున నిబంధనల ప్రకారం కనీసం ఒక స్కూల్ అసిస్టెంట్ ఉండాలని, కానీ ఉన్న ఒక్క స్కూల్ అసిస్టెంట్‌ను అక్రమ డిప్యూటేషన్‌పై పంపించి వేరొకరిని సర్దుబాటు చేశామని కుంటి సాకులు చెబుతున్నారని విమర్శించారు. బలహీన వర్గాల పిల్లల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన ఎంఈఓ విజయ్ కుమార్‌పై తక్షణమే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని,లేనిపక్షంలో జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు.

## ఎడపల్లిలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

**ప్రజాపక్షం/ఎడపల్లి:** గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం ఎడపల్లి మండల కేంద్రంలో గల సాయిబాబా ఆలయంలో, జానకంపేట్ గ్రామ శివారులోని స్వయం భూ శివాలయంలో ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించారు. ఎడపల్లి మండల కేంద్రంలో గల సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాన్ని రంగురంగుల పూలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈ మేరకు ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలలో పలువురు ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 30న దిలావర్‌పూర్ మండల ప్రజా పరిషత్ సమావేశం

### ఎంపిడిఒ అరుణ రాణి

**ప్రజా పక్షం /దిలావర్‌పూర్ :** దిలావర్‌పూర్ మండల ప్రజా పరిషత్ (ఎంపీపీ) సర్వసభ్య సమావేశం ఈ నెల 30న ఉదయం 11.00 గంటలకు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అరుణ రాణి ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా ముఖ్య కార్యనిర్వహణ అధికారి (జెడ్పీ సీఈవో) ఆదేశాల మేరకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల పరిధిలోని పలు శాఖల ప్రగతి నివేదికలపై విస్తృతంగా సమీక్షించనున్నట్లు వెల్లడించారు.

**చర్చించనున్న ముఖ్య అంశాలు :** సమావేశంలో విద్యా శాఖ, వ్యవసాయం, గ్రామీణ తాగునీటి సరఫరా, పశుసంవర్ధక, ఇంజనీరింగ్, విద్యుత్, గృహనిర్మాణ శాఖలతో పాటు ప్రజా పంపిణీ వ్యవస్థ, వైద్య ఆరోగ్యం, స్త్రీశిశు సంక్షేమం, ఉపాధి హామీ, ఇందిరా క్రాంతి పథకం, నీటిపారుదల, రోడ్లురవాణా సౌకర్యాలు మరియు పంచాయతీ రాజ్ వంటి ముఖ్యమైన శాఖల ద్వారా జరిగిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సమావేశానికి మండల ప్రత్యేక అధికారి, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్వ సర్పంచులు తప్పక హాజరు కావాలని, అలాగే ఆయా శాఖల అధికారులు జూన్ మాసాంతం వరకు సాధించిన ప్రగతి నివేదికలను సమర్పించాలని ఎంపీడీవో కోరారు.

## డయల్ యువర్ ఎమ్మెల్యేలో జర్నలిస్టుల గోడుకు స్పందన

### ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే విజయరమణరావు హామీ




**ప్రజా పక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని జర్నలిస్టుల చిరకాల వాంఛ అయిన ఇళ్ల స్థలాల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని ప్రభుత్వ విప్,స్థానిక శాసనసభ్యులు చింతకుంట విజయరమణరావు భరోసా ఇచ్చారు.ఆధ్వర్యంలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం బుధవారం సాయంత్రం 4 నుండి 5 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ పెద్దపల్లి ఎమ్మెల్యే ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజేఐజేయు పెద్దపల్లి మండల అధ్యక్షులు,సీనియర్ జర్నలిస్ట్ వీరమల్ల విద్యాసాగర్ రావు ఎమ్మెల్యేతో ఫోన్ ద్వారా మాట్లాడారు.దీనిపై ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు సానుకూలంగా స్పందిస్తూ..ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకూ త్వరలోనే ఇళ్ల స్థలాలు అందేలా అన్ని చర్యలు తీసుకుంటామని,ప్రెస్ క్లబ్ భవనం కోసం స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇవ్వడంతో ఈ ప్రత్యేక కార్యక్రమం ముగిసింది.

## లక్ష్మీ నరసింహా స్వామి దేవస్థాన జూనియర్ అసిస్టెంట్ ప్రమోషన్

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎడపల్లి మండలంలోని జానకంపేట్ శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి దేవస్థానంలో గత 23సంవత్సరాలుగా జూనియర్ అసిస్టెంట్‌గా విశేష సేవలందించిన కులకర్ణి రఘునాథ్‌కు మూడవ శ్రేణి కార్య నిర్వహణాధికారిగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా ఆయన స్వామి వారి కృపకు, ఆలయ అధికారులు, స్థానిక గ్రామస్తుల సహకారానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు. గ్రామస్తులు, భక్తులు, తోఇ సిబ్బంది తనపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయతలు ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని, రాబోయే రోజుల్లో కూడా స్వామి వారి సేవలో, ఆలయాభివృద్ధిలో నిష్టతో పనిచేస్తానని ఆయన తెలిపారు. రఘునాథ్‌కు ఈఓగా పదోన్నతి రావడం పట్ల పలువురు ఆలయ అర్చకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు అభినందనలు తెలియచేశారు.

## బాలల హకులు, ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి

### సర్పంచ్ నోముల జయశ్రీ

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎడపల్లి మండలంలోని ఎమ్మెస్సి ఫారం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో బుదవారం సర్పంచ్ నోముల జయశ్రీ శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన బాలసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లల అభిప్రాయాలను సందేహాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పరిసరాల పరిశుభ్రత, నీటి సంరక్షణ లక్ష్యంగా సోక్ పిట్ అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్పంచ్ నోముల జయశ్రీ, శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి రాజు చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందచేసి విద్యార్థులను అభినందించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని, ఇంకుడు గుంతల ప్రాముఖ్యతను తమ ఇళ్ల వద్ద తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జల వనరుల పరిరక్షణకు ప్రజలంతా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

**ప్రజాపక్షం/ఎడపల్లి:** భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా చేయాలంటే ప్రతి గ్రామంలో జలవనరుల పరిరక్షణకు ప్రజలంతా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎంపిడిఓ శంకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జలిసిరి కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎడపల్లి మండలంలోని ఠాణాకలాన్, బాపునగర్, ధర్మారం, జమ్లం, అంబం, జానకంపేట్, బ్రహ్మణపల్లి, దుబ్బాతండా, ఏఆర్పీ క్యాంప్ గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. నీటిని కాపాడటం అంటే మన భవిష్యత్తును కాపాడినట్లేనని ప్రభుత్వం చేపట్టిన జలసిరి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాద్యతగా భావించి నీటి వనరుల సంరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ వర్షంతో సంతరించుకున్న జలకళ

**ప్రజాపక్షం/ఎడపల్లి:** గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు, చెరువులు నీటితో దర్శనమిస్తున్నాయి. పంట పొలాల్లో నీర ు నిండి పోయింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు మంగళవారం కొంత ఊరటనిచ్చాయి. దీంతో రైతులు పనుల్లో బిజిబిజిగా మారారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనగా మంగళవారం రాత్రి కురిసిన వర్షంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరో వారం రోజుల పాటు ఇలాగే వర్షం కురిస్తే పంటలకు సాగునీరు డోకా లేదని పేర్కొంటున్నారు. భారీగా కురిసిన వర్షంతో ఎడపల్లి మండల కేంద్రంలోని ఓ ఖాళీ ఇల్లు పాక్షికంగా కూలింది. ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు.

## నీటి అవసరం తక్కువగా ఉండే పంటలనే సాగు చేయాలి



**ప్రజాపక్షం/మోర్తాడ్:** రైతులు నీటి అవసరం తక్కువగా ఉండే వర్షాధార పంటలను సాగు చేయాలని మోర్తాడ్ మండల వ్యవసాయ శాఖ అధికారి హరీష్ కుమార్ అన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని రైతు వేదికలో విత్తనమేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వానాకాలం సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం లేదా తక్కువ వర్షపాతం ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు నీటి అవసరం తక్కువగా ఉండే వర్షాధార పంటలను సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి హరీష్ కుమార్ సూచించారు. ఈ సందర్భంగా మోర్తాడ్ రైతు వేదికలో విత్తన మేళా నిర్వహించగా, ఇందులో కందులు(రెడ్‌గ్రామ్), మినుములు, వివిధ కూరగాయాల విత్తనాలను ప్రదర్శించారు. రైతులకు అందుబాటులో ఉన్న నాణ్యమైన విత్తనాల గురించి వివరించి, తక్కువ వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కందులు, సజ్జలు, మొక్కజొన్న వంటి వర్షాధార పంటలను సాగు చేయడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని సూచించారు. అలాగే రైతులు ధ్రువీకరించిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసి, బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. విత్తనాల ప్యాకెట్‌పై ఉన్న వివరాలను పరిశీలించి కొనుగోలు చేయాలని అవగాహన కల్పించారు. కూరగాయల సాగు ద్వారా కుటుంబ పోషకాహార భద్రతతో పాటు అదనపు ఆదాయం కూడా పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది విత్తనాల విక్రేతలు, పలువురు రైతులు పాల్గొని విత్తన ప్రదర్శనను పరిశీలించారు. రైతులు విత్తన మేళాను సద్వినియోగం చేసుకొని తమ ప్రాంత పరిస్థితులకు అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి హరీష్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించటంతో పాటు బోగస్ ఓట్లను అరికట్టి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి రెవెన్యూ అధికారులను కోరారు. ఎన్నికల సంఘం చేపట్టిన సర్ కార్యక్రమం అమలు తీరును పర్యవేక్షించిన అనంతరం క్కువ నమోదున్న పోలింగ్ బూత్‌ల వివరాలతో కూడిన వినతిపత్రాలను బీఆర్‌ఎస్ పార్టీ పక్షాన అన్ని మండలాల తహసీల్దార్లకు అందజేశారు. ఓటరు నమోదు ప్రక్రియలోని లోపాలను సరిదిద్దేందుకు నిన్నటి నుండి కమ్మర్‌పల్లి, మోర్తాడ్, బాల్కొండ, మెండోరా, తదితర మండలాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఆయా మండలాల తహసీల్దార్లతో సమావేశమై స్థానికంగా ఉన్న ఇబ్బందులపై చర్చించారు. నియోజకవర్గంలో నో మ్యాపింగ్, పర్మినెంట్ షిఫ్టింగ్ సగటు 4 శాతంగా ఉందని, అంతకంటే ఎక్కువ ఉన్న బూత్‌లను గుర్తించి అధికారులకు నివేదించారు. బుధవారం భీమ్‌గల్, వేల్పూర్ మండలాల్లో పర్యటించి ఆయన భీమ్‌గల్ తహసీల్దార్‌తో సమావేశమై మండంలోని మొత్తం 56 పోలింగ్ బూత్‌లకు గాను 24 బూత్‌లలో నమోదు ప్రక్రియ సమస్యాత్మకంగా ఉన్నట్లు గుర్తించారు. అందులో 14 బూత్‌లలో నమోదు అత్యల్పంగా ఉండటమే కాకుండా నో మ్యాపింగ్, ఆబ్సెంట్, పర్మినెంట్ షిఫ్టింగ్ వాల్యూస్ అత్యధికంగా ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎస్‌ఐఆర్‌ను పూర్తి పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని కోరుతూ బీఆర్‌ఎస్ పక్షాన నియోజకవర్గంలోని అన్ని మం డలాల తహసీల్దార్లకు సమగ్ర వివరాలతో కూడిన వినతిపత్రాలను సమర్పించినట్లు ఎమ్మెల్యే వేముల స్పష్టం చేశారు.

# విపత్తుల సమయాల్లో సమర్థవంతంగా సేవలందించాలి

### అదనపు కలెక్టర్ భుజంగరావు




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** విపత్తులు సంభవించిన సమయాల్లో ఆదప మిత్ర వాలంటీర్లు తక్షణమే స్పందిస్తూ సహాయక చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ భుజంగరావు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో బుధవారం ఆ పద మిత్ర వాలంటీర్లకు కిట్లు పంపిణీ చేశారు. విపత్తుల స మయాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు ఉపకరించే 14 రకాల వస్తువులతో కూడిన ఈ కిట్‌ను ఎలా ఉపయోగించాలనే విషయాలపై ఎస్‌డిఆర్‌ఎఫ్ అధికారులు తెలిపారు. ఆ స్తి, ప్రాణ నష్టాన్ని ఎలా నివారించాలి, అత్యవసర సమయాల్లో ప్రాథమిక చికిత్స పద్ధతులు, సీపీఆర్ చేసే విధా నం, తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు కలెక్టర్ భుజంగరావు మాట్లాడుతూ విపత్తులను నిలువరించే శక్తి ఎవరికి ఉండదని, అయితే ముందస్తు సన్నద్ధతతో ప్రాణ, ఆస్తి నష్టాల్ని చాలా వరకు నివారించవచ్చన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి గీత మాట్లాడారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు శ్రీనివాస్‌రావు, ఆర్‌ఎస్‌ఐ శ్రీనివాస్, అగ్నిమాపక, 7వ బెటాలియన్ అధికారులు, ఆపద మిత్ర వాలంటీర్లు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీలు చేసిన సిపి



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** ప్రతి కేసు ఇన్వెస్టిగేషన్‌లో నూతన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి కేసుల పరిష్కారానికి పూనుకోవాలని నిజామాబాద్ పోలీసు కమిసనర్ పి. సాయి చైతన్య అన్నారు. బుధవారం నిజామాబా ద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను వార్షి క తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు చేరుకున్న కమిసనర్‌కి పోలీసు అధికారులు, సిబ్బంది గౌరవ వందనం చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మొక్కనాటి స్టేషన్‌లో వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మొదటగా స్టేషన్‌లో సిబ్బందికి అందుబాటులో ఉన్నకిట్ ఆర్టికల్స్, భద్ర తా పరికరాలు, ఆయుధాల నిర్వహణ, రికార్డుల సంరక్ష ణ తదితర అంశాలను పరిశీలించి వాటి నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం రిసెప్షన్ సెంటర్‌ను సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న రిజిస్టర్లు, ఫిర్యాదుల నమోదు విధానం, ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించారు. స్టేషన్‌లో అమలవుతున్న 5 ఎస్ విధానం అమలు తీరును సమీక్షించి ప్రజలకు స్నేహపూర్వక పోలిసింగ్ అందించడంలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మహిళలు, వృద్ధులు, అత్యవసర సహాయం కోసం వచ్చే ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకొని స్పందించాలన్నారు. ప్రధానంగా అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అండర్ ఇన్వెస్టిగేసన్ కేసులచేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, ప్రతి కేసులో నాణ్యమైన, ఇన్వెస్టిగేషన్ చేయాలని సబ్ ఇన్స్‌పెక్టర్‌కు సూచనలు చేశారు. గేమింగ్ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు., ముఖ్యంగా బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. కార్యక్రమంలో నిజామాబాధ్ ఏసిపి బి. ప్రకాష్ యాదవ్, సిసిఆర్‌బి ఎసిపి గురునాయుడు, నిజామాబాద్ రూరల్ ఎస్‌హెచ్‌ఓసి హెచ్ శ్రీనివాస్, ఎస్‌ఐ 1 ఎం.డి. షరీఫ్, ఎస్‌ఐ 2 ఎ. ఆనంద్ సాగర్, ఎస్‌ఐ3 ఎ. మహేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# 'సర్' పోగ్రాంపై ముఖ్య నాయకులతో రివ్యూ



**ప్రజాపక్షం/మాక్లూర్ :** మండలంలో సర్ పోగ్రాం పకడ్బంధీగా నిర్వహించాలని ముఖ్య నాయకులు మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఆకుల లలిత రివ్యూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించటంతో పాటు బోగస్ ఓట్లను అరికట్టి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని ముఖ్య నాయకులకు కోరారు. ఎన్నికల సంఘం చేపట్టిన సర్ కార్యక్రమం అమలు తీరును అలాగే తక్కువ నమోదున్న పోలింగ్ బూత్‌ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిఒక్క కాంగ్రెస్ కార్యకర్తను ఓటు నమోదయ్యేలా చర్యలు చేపట్టాలి ఇంకా సమయం ఉన్నందున అర్హులైన ఒక్క ఓటరుకు అన్యాయం జరగకుండా ఓటరు నమోదు శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సర్ పోగ్రాంలో నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి సలహా సూచనలు పాటించాలని కాంగ్రెస్ ముఖ్య నాయకులు తెలిపారు. కాంగ్రెస్ అధిష్టానం నిజామాబాద్ జిలా కోఆర్డినేటర్‌గా ఇచ్చినందున తన కర్తవ్యాన్ని సంపూర్తిగా నిర్వహించేలా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని నాయకులు తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు దయాకర్, ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ అశోక్, శ్రీనివాస్‌గౌడ్, గంగాధర్‌గౌడ్, లింగారావు, సతీష్, అమర్, రాజేశ్వర్, ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు సతీష్, జైలసింగ్, భోజన్న, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వినోద్ కాంగ్రెస్ ముఖ్యనాయకులు పాల్గొన్నారు

## అన్ని సేవల కన్నా సమాజ సేవే ముఖ్యం: ఎమ్మెల్యే వేముల



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మండలంలోని ముచ్కూర్, భీమ్‌గల్ జడ్పీహెచ్‌ఎస్‌లను మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా జడ్పీహెచ్‌ఎస్‌కు వ్యాపారవేత్త ఏనుగు దయానందరెడ్డి సౌజన్యంతో విద్యార్థులకు రెండు పాఠశాలలకు 25 చొప్పున డ్యూయల్ డెస్క్ బెంచీలను పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన విద్య వాతావరణం కల్పించేందుకు సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లి ఐఎఎస్, ఐపీఎస్ మంచి మేధావులుగా ఎదిగి ప్రపంచానికి సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు భగత్ నర్సయ్య, మల్లె అనుపమ ప్రసాద్, నీలం రవి, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ స్వామి, రమేష్, ఉపాధ్యాయ బృందం, మండల అధ్యక్షులు దొన్కంటి నర్సయ్య, మాజీ జడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, మాజీ జడ్పీ కోఆప్షన్ మెంబర్ మొయిజ్, కౌన్సిలర్ నీలం రవి, మాజీ ఎంపీపీ ఆర్మూర్ మహేష్, కార్మికశాఖ అధ్యక్షులు డిష్ గంగాధర్, గ్రామశాఖ అధ్యక్షులు గంగాగౌడ్, గ్రామసర్పంచ్ కొడిగేలా శ్రీనివాస్, ఉపసర్పంచ్ బాశెట్టి రమేష్, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు శోభ, మాజీ సర్పంచ్ బండి శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ భూమేశ్వర్, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గురువు దైవంతో సమానం..

### అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** గురువు దైవంతో సమానమని, గురువులు జీవితంలోని అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞాన వెలుగును ప్రసాదిస్తారని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ అన్నారు. బుధవారం నగరంలోని బింగికళ్యాణ మండపంలో గురుపూర్ణిమను పురస్కరించుకొని గురువు కోనస ముందర్ శ్రీనివాస్ శర్మ దంపతులకు కుటుంబసమేతంగా పాద పూజ చేశారు. భారతీయ సం ప్రదాయంలో గురువు స్థానం దైవంతో సమానమని జీవితంలోని అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞాన వెలుగును ప్రస్తాదిస్తారని అన్నారు.

## ఆన్‌లైన్ మట్కా నిర్వహకుల అరెస్ట్..

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఫోన్ యాప్, వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ మట్కా నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎడపల్లి పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెహ్రూ నగర్‌కు చెందిన షేక్ ముకీమ్, జానకంపేట్‌కు చెందిన గులామ్ అనే ఇద్దరు వ్యక్తులు స్మార్ట్‌ఫోన్‌లోని మట్కా వెబ్‌సైట్, వాట్సాప్ చాట్ ద్వారా అక్రమంగా మట్కా జూదం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో మంగళవారం రాత్రి జానకంపేట్‌లో పోలీసులు దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి రూ. 6,780ల నగదు, రెండు మొబైల్ ఫోన్లు, ఒక రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ జూదాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

## ఘనంగా గురుపూజోత్సవం

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** గురువు మార్గదర్శకుడని గురువును ఆశ్రయిస్తే జ్ఞానంతో పాటు జీవిత పాఠాలు నేర్చుకుంటారని డైరెక్టర్ యోగా గురు రామచంద్ర అన్నారు. బుధవారం గురుపూర్ణిమ సందర్భంగా దయానంద్ యోగ ట్రస్ట్ సుభాష్‌నగర్ ఆధ్వర్యంలో ఉదయం యజ్ఞం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించామన్నారు. సూర్య దీక్షితులు గురువు విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించి రామచంద్ర మాట్లాడారు. గురుపరంపర వ్యాసభగవానుడి జన్మదినం రోజు ఈ గురు పౌర్ణమి దేశంలో సంవత్సరాలుగా జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో రాంచందర్, రుక్మన్‌రావు, శివరాజ్, శ్రీనివాస్, మురళి, రాజశేఖర్, అశోక్‌కుమార్, గురుపాదం, రాజేందర్, కిరణ్‌కుమార్, పద్మ, సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.